ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 124, పేజీలు - 08

బుధవారం, నవంబర్ 4, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

ముంపునకు పరిహారం..

బ్యారేజీకి మార్గం!

మహారాష్ట్రతో చర్చలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

- ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం - జాయింట్ అకౌంట్‌లో నిధుల జమకు ప్రభుత్వం సానుకూలం
- మహారాష్ట్ర సర్వేకు అభ్యంతరం లేదు - ఒప్పందాల పత్రాలు అందజేయాలని ఆదేశం
- ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్‌తో కలిసి సీఎం సమీక్ష



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎదురవుతున్న అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్రతో ఉన్న అంశాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రాజెక్టు కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచేందుకు కూడా తమకు అభ్యంతరం లేదని వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ముంపు భూములపై సర్వే చేపట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేయడం ఈ సమీక్షలో కీలక పరిణామంగా మారింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని

2లో..

ధర్నా చౌక్‌లలోనూ
టైమ్ లిమిట్ ఉండాల్సిందే

- సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆందోళనలు లేదా నిరసనల పేరుతో ఏ ఒక్కరూ ఒక ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించుకోరాదని, వీటి కోసం నిర్దేశించిన ప్రదేశాలకు కూడా నిర్దిష్ట కాలపరిమితి ఉండాలని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. గత నెల సెంట్రల్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, అలాగే ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా విపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలు ప్రజా సంఘాలు రామ్‌లీలా మైదానంలో చేపట్టిన భారీ నిరసనలపై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా తొలగించిన ఢిల్లీ ప్రభుత్వం

2లో..

'సర్' వద్దంటే
వీపంతా సాఫ్ చేయాలి

- నిర్మల్ సభలో బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- చనిపోయిన నేతలకు ఇంకా ఓట్లు ఉండాలా?
- కాంగ్రెస్, ఇండీ కూటమిపై తీవ్రస్థాయిలో ధ్వజం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే
- తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. ఎగిరేది కాషాయ జెండానే



నిర్మల్ (ప్రశ్న న్యూస్) 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) విషయంలో అనవసరంగా అద్దంకులు సృష్టించే వారిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నిర్మల్‌కు వచ్చి 'సర్' వద్దంటే అటువంటి వారి వీపంతా సాఫ్ చేయాలని వ్యాఖ్యానించారు. దశాబ్దాల క్రితమే మరణించిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, 2004లో మరణించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో పాటు ఇతర ప్రముఖులకు ఇప్పటికీ ఓట్లు ఉన్నాయని, చనిపోయిన వారి ఓట్లతో పాటు డూప్లికేట్ ఓట్లను తొలగించాలా? వద్దా? అని ప్రశ్నించారు. నిర్మల్‌లో నిర్వహించిన మహా పాదయాత్ర సభకు బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు ఒక్కసారిగా 'సీఎం..

2లో..

హైదరాబాద్‌లో భారీ ఫేక్ కరెన్సీ రాకెట్

- రూ.6.78 కోట్ల నకిలీ నోట్ల పట్టివేత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగర శివార్లలో నకిలీ కరెన్సీ ముద్రించి, చలామణీ చేయడంతో పాటు దోపిడీలకు పాల్పడుతున్న ఓ భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రింటర్లు, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని కూడా సీజ్ చేసినట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, నవంబర్ 1వ తేదీన జాతీయ రహదారి-65పై రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో ఒక కారులో నకిలీ నోట్లను విజయవాడకు తరలిస్తున్నట్లు

2లో..

'పుర'పోరులో కూటమి ప్రభంజనం

- కంచుకోటలోనూ వైసీపీకి బిగ్ షాక్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. కేవలం 4 మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ లో వైసీపీ ప్రభావం చూపింది. ఎన్నికలకు ముందే 17 పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ విజయం సాధించాయి. వైజాగ్, గుంటూరు మేయర్లుగా టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీతో పాటు చైర్ పర్సన్ స్థానాన్ని వైసీపీ సొంతం చేసుకుంది. ఉమ్మడి కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల్లో అన్ని మున్సిపాలిటీలను కూటమి కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేసి వైసీపీకి షాకిచ్చింది. పాతికేళ్ల తరువాత ఇచ్ఛాపురం మున్సిపాలిటీని టీడీపీ సొంతం చేసుకుంది.

జగన్ కంచుకోట బద్దలు..

వైసీపీ కంచుకోట పులివెందులను సైతం కూటమి బద్దలుకొట్టింది. కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీలో కూటమి ఘన విజయం సాధించింది. టీడీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి గీతాకుమారి 13,875 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికలు జరిగిన 20 వార్డులలో 17 స్థానాలను కైవసం



చేసుకున్న కూటమి, ఏకగ్రీవాలతో కలిపి మొత్తం 37 వార్డుల్లో విజయకేతనం ఎగురవేసింది. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో ఆ పార్టీ కేవలం 3 వార్డులకే పరిమితమైంది. పులివెందులతో పాటు బద్వేలు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, రాజంపేట, యర్రగుంట్లలోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు.

కూటమి గెలుపొందిన మున్సిపాలిటీలు ఇవే

టీడీపీ: నర్సీపట్నం, ఇచ్ఛాపురం, పలాస, పెద్దాపురం, మండపేట, కొవ్వూరు, ఆకివీడు, జగ్గయ్యపేట, నూజివీడు, జంగారెడ్డిగూడెం, ఉయ్యూరు, నందిగామ, కొండపల్లి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రేపల్లె, ఆత్మకూరు(నెల్లూరు), కనిగిరి, ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరు,

2లో..

ఇందిరమ్మ ఇళ్లకు ఈ-లాటరీ

- ఈ-లక్కీడ్రా ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- నియోజకవర్గానికి 5,500 ఇళ్ల చొప్పున మంజూరు
- ఉపాధి ఎక్కడ ఉంటే.. ఇల్లు అక్కడే ఉండాలన్నదే లక్ష్యం
- అర్హులైన కొత్త వారు పేర్లు నమోదు చేసుకోవాలి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయంలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల కోసం నిర్వహించిన ఈ-లాటరీని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలోని గోషామహల్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన

2లో..

24 గంటలు గడిచిపోయాయి
ఇప్పటికైనా రండి

- ప్రధాని మోడీకి రాహుల్ సవాల్..!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) విదేశీ శక్తుల సాయంతో దేశాన్ని ముక్కలు చేసేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నట్లు ప్రధాని మోడీ చేసిన ఆరోపణలపై చర్చకు రావాలంటూ విపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. అయితే ప్రధాని మోడీ మాత్రం 24 గంటలైనా స్పందించకపోవడంపై రాహుల్ మరో ట్వీట్ చేశారు. ఇందులో మోదీ జీ, 24 గంటలు గడిచిపోయాయి, ప్రతిపక్షం దేశద్రోహి అని మీరు చేసిన వ్యాఖ్యలపై చర్చకు ఏదైనా వేదికను, స్థలాన్ని ఎంచుకోవాలని, తనతో చర్చకు రావాలని రాహుల్ మరోసారి కోరారు. అసలు దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాలు ఎలాంటివి? అని ప్రశ్నించారు. ఆలస్యం చేయకండి, త్వరగా రండి, భయపడకండి అంటూ మోడీకి చురకలు అంటించారు.మనం ఇద్దరం అక్కడ ఉంటాం, మీడియా ఉంటుంది, దేశ యువత ఉంటుంది. ఒక టేబుల్ ఉంటుంది, ఒక వైపు మీరు కూర్చుంటారు, మరో వైపు నేను కూర్చుంటాను. మీరు ఎవరిని న్యాయనిర్ణేతగా నియమించాలనుకుంటున్నారో, వారిని తీసుకురండి. కావాలంటే మోహన్ భగవత్ జీని ఆ కుర్చీలో

2లో..

తెలంగాణ అసెంబ్లీకి
కొత్త రూపు

- భారీ విస్తరణకు మాస్టర్ ప్లాన్

- కొత్త బిల్డింగ్‌లు, పార్కింగ్‌కు ప్రతిపాదనలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలకు కొత్త రూపు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేస్తోంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాంగణాన్ని విస్తరించడంతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. కొత్త భవనాలు, ప్రజాప్రతినిధుల నివాసాలు, పరిపాలనా కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, మెరుగైన పార్కింగ్ సదుపాయాలు.. ఇలా పలు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి ప్రతిపాదిత అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించారు. శాసనసభ కార్యకలాపాలు, ప్రజాప్రతినిధుల అవసరాలకు అనుగుణంగా ప్రాంగణంలో అదనపు నిర్మాణాలు చేపట్టాలని అధికారులు ప్రతిపాదించారు. శాసనసభ స్పీకర్, శాసన మండలి చైర్మన్,

2లో..

కూటమి సుపరిపాలనకు ప్రజలు అండగా నిలిచారు

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సీఎం చంద్రబాబు నాయుడు

- రాజకీయాల కన్నా ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత అని ఉద్ఘాటన
- అమరావతి, పోలవరం పనులను వేగవంతం చేశామని వివరణ
- ప్రజలు మెచ్చే పాలన అందించడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ



అమరావతి (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం అందిస్తోన్న సుపరిపాలనకు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పు ద్వారా మద్దతు తెలిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై ఈ మేరకు మీడియా సమావేశంలో స్పందించారు. అనునిత్యం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించే ప్రజలు కూటమికి అండగా నిలిచారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందనే నమ్మకం,

2లో..

ముంపునకు పరిహారం.. బ్యారేజీకి మార్గం!

సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చలు, ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. రెండు రాష్ట్రాల మధ్య గతంలో కుదిరిన ఒప్పందాలు, ఇతర కీలక అంశాలకు సంబంధించిన పత్రాలను సమగ్రంగా సిద్ధం చేసి మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని సీఎం సూచించారు.ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఎలాంటి సందేహాలు తలెత్తకుండా అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అక్కడి అధికారులకు అందించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో ప్రధానంగా ప్రస్తావనకు వస్తున్న అంశం మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల అక్కడి భూములకు నష్టం కలిగే పరిస్థితి ఉంటే.. బాధితులకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. పరిహారం చెల్లింపులకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, వాటి వివరాలను నిర్ధారించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తే సహకరించాలని అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సర్వేకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. దీంతో ముంపు సమస్యను పరిష్కరించేందుకు రెండు రాష్ట్రాల మధ్య సమన్వయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడైంది. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.మహారాష్ట్ర అధికారులకు అవసరమైన సమాచారం అందించడంలో జాప్యం చేయవద్దని.. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, గత చర్చలకు సంబంధించిన ఆధారాలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం లేకుండా నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని చెప్పారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ అంశం తెలంగాణ సాగునీటి రంగంలో కీలకమైనది. మహారాష్ట్రలో ముంపు సమస్య, భూసేకరణ, పరిహారం వంటి అంశాలు రెండు రాష్ట్రాల మధ్య చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పుడు పరిహారం చెల్లించేందుకు సిద్ధమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించడం, ముంపు భూముల సర్వేకు అంగీకరించడం ద్వారా సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేసే ప్రయత్నం జరుగుతోంది. అయితే ఈ నిర్ణయంతోనే ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన అన్ని అడ్డంకులు తొలగిపోయినట్లు భావించలేమని నిపుణులు చెబుతున్నారు.ముంపు భూముల సర్వే, పరిహారం అంచనాలు, రెండు రాష్ట్రాల మధ్య తదుపరి ఒప్పందాలు వంటి ప్రక్రియలు పూర్తికావాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ అంశాల్లో పురోగతి సాధిస్తే తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి కీలక ముందడుగు పడే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ అంశంపై చర్చలను వేగవంతం చేయాలని భావిస్తోంది.

ధర్నా చౌక్‌లలోనూ టైమ్ లిమిట్ ఉండాల్సిందే

రామ్‌లీలా మైదానం సహా మూడు ప్రత్యామ్నాయ స్థలాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విచారణలో కేంద్రం తరఫున హజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ నిరసనలకు పిలుపునిచ్చే వారే ఆ నిరసనల వల్ల కలిగే ఎలాంటి పర్యవసానాలకైనా పూర్తి బాధ్యత వహించాలని కోర్టుకు తెలిపారు. "ఎవరూ నిరంతరం ఒకే ప్రాంతాన్ని ఆక్రమించుకోలేరు అక్కడ ఇతర నిరసనకారులు కూడా ఉంటారు. అలాంటప్పుడు రైతులు గానీ, న్యాయవాదులు గానీ తమ నిరసనలు ఎక్కడ తెలుపుకోవాలి? నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుంది" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానించారు. పండుగల సీజన్‌లో నిరసనలను నిలిపివేయాలని కోరుతూ ఢిల్లీ వర్తక సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని కేంద్రం సహా ఇతరులకు సీజేఐ నోటీసులు జారీ చేశారు. జులై 20న జరిగిన నిరసనలకు కేవలం ఒక్క రోజు మాత్రమే అనుమతి ఇచ్చామని, అయితే నిరసనకారులు ఆ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా పార్లమెంట్ వైపు కూడా మార్చ్ నిర్వహించారని తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "పార్లమెంట్ అనేది కేవలం మరొక సాధారణ రాజకీయ భవనం కాదు. మీరు పార్లమెంట్‌కే నేరుగా మార్చ్ నిర్వహించలేరు. అలాగే సుప్రీంకోర్టు వైపు కూడా మార్చ్ చేయడానికి వీల్లేదు" అని ఆయన అన్నారు. వర్తక సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లతో పాటు ముందస్తు అరెస్టులు, పోలీసుల లాఠీఛార్జ్, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత అంశాలపై దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. నిరసనల వల్ల వ్యాపార నష్టం వాటిల్లిందని ఆరోపిస్తున్న వ్యాపార సంఘాలు సీఈసీ వ్యతిరేక నిరసన నిర్వాహకులను తమ పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చాలని ధర్మాసనం సూచించింది.సుప్రీంకోర్టు వ్యాఖ్యలను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ సెక్రటరీ జనరల్, ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ స్వాగతించారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కుకు, అలాగే పౌరులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందే సమానమైన హక్కుకు మధ్య రాజ్యాంగబద్ధమైన సమతౌల్యతను కాపాడాల్సిన ఆవశ్యకతను సుప్రీంకోర్టు వ్యాఖ్యలు నొక్కిచెప్పాయని ఖండేల్వాల్ వ్యాఖ్యానించారు. నిరసన ప్రాంతం చుట్టుపక్కల దాదాపు 50 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారని, నిరసనల కారణంగా కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో షాపులన్నీ మూతపడి జనసంచారం లేకుండా పోయిందని వర్తకుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు వివరించారు. నిరసన నిర్వాహకులను వర్తక సంఘాలు ఈ కేసేలో ప్రతివాదులుగా చేర్చకుండా కోర్టు ఏ నిర్ణయమూ తీసుకోలేదని ధర్మాసనం పేర్కొంది. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్ అక్రమాలపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, 12 మంది విపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై అక్టోబర్ 15న ధర్మాసనం స్పందిస్తూ ఈసీ సహా ఇతరులకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

'సర్' వద్దంటే వీపంతా

సాఫ్ చేయాలి

సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన బండి సంజయ్.. మరోసారి సీఎం అంటూ నినాదాలు చేస్తే మైక్ బంద్ చేసి వెళ్లిపోతానని కార్యకర్తలను హెచ్చరించారు. నిర్మల్ గడ్డ పూర్తిగా కాషాయ అడ్డా అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌ది రాక్షస సేన.. ఇటలీ నేతలకు ప్రధాని పదవిపై కలలు!

కాంగ్రెస్, ఇండీ కూటమిపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇటలీ సంతతికి చెందిన వ్యక్తులు ఈ దేశానికి ప్రధాని కావాలని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని రాక్షస సేనగా అభివర్ణిస్తూ.. ఆ పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలను ప్రధాని నరేంద్ర మోదీ గరళ కంఠుడిలా భరిస్తున్నారని అన్నారు.

"మీ ముత్తాత, నానమ్మ, తండ్రి హయాంలోనే ఎస్ఐఆర్ చేపట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకించలేదు?" అంటూ రాహుల్ గాంధీని ప్రశ్నించారు. 'సర్' అంశంపై రాహుల్‌కు కనీస అవగాహన కూడా లేదని విమర్శించారు. ఈ దేశ పౌరులే ప్రధానిని, ఎంపీలను, ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలకు చెందిన వ్యక్తులు ఇక్కడి ప్రధాని, ముఖ్యమంత్రులను నిర్ణయిస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిని ఉరికించి ఉరికించి కొడతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. సీఏఏ, ఎన్ఆర్సీలను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

అమిత్ షా పాదయాత్రకు లక్షలాది మంది మద్దతు

ఎస్ఐఆర్ అమల్లోకి తీసుకురావాలని కోరుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేపట్టిన పాదయాత్రకు లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి మద్దతు తెలిపారని బండి సంజయ్ గుర్తుచేశారు. ఆ యాత్రలో అమిత్ షాకు వందనం చేసినందుకు తనతో పాటు రామచంద్రరావును కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని మండిపడ్డారు. తమకు ప్రత్యర్థి పార్టీల మాదిరిగా మందు పోసే సంస్కృతి లేదని, ఢిల్లీ పెద్దలకు డబ్బు సంచులు పంపే అలవాటు కూడా లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలను ప్రజలు ఉరికించి కొట్టే రోజులు త్వరలోనే రాబోతున్నాయని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో వచ్చేది కాషాయ ప్రభుత్వమే!

తెలంగాణ గడ్డపై ఇక రంగురంగుల జెండాలకు చోటు లేదని, రాబోయే రోజుల్లో ఎగిరేది ఒక్క కాషాయ జెండానేనని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలంతా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. రామచంద్రరావు నాయకత్వంలో తెలంగాణలో బీజేపీని కచ్చితంగా అధికారంలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగా లేక, సరిపడా నీళ్లు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్లు అందక వృద్ధులు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి 'సర్' పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల తీరు ఇలాగే కొనసాగితే త్వరలోనే ఎన్ఆర్సీని తీసుకొచ్చి తీరుతామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో భారీ ఫేక్ కరెన్సీ రాకెట్

పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ సంయుక్తంగా వాహనాన్ని అడ్డగించి తనిఖీ చేశారు. కారులో ఉన్న ఎం. కరుణాకర్, సిహెచ్. మాణిక్య రెడ్డి, సిహెచ్. రత్నాకర్ రెడ్డి, కె. అజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.8 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా, కుంట్లూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నకిలీ కరెన్సీ ప్రింటింగ్ యూనిట్‌ను నడుపుతున్నట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు వెంటనే ఆ ఇంటిపై దాడి చేసి, భారీ మొత్తంలో నకిలీ నోట్ల కట్టలు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్, కరెన్సీ కటింగ్ మెషీన్‌లను సీజ్ చేశారు.

నిందితుల మోసం ఇలా..

ఈ ముఠా కేవలం నకిలీ నోట్లను ముద్రించడమే కాకుండా, వినూత్న పద్ధతిలో దోపిడీలకు పాల్పడేదని పోలీసులు తెలిపారు. తక్కువ ధరకు నకిలీ కరెన్సీ ఇస్తామని, అసలు డబ్బు ఇస్తే మూడు, నాలుగు రెట్లు నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపి కస్టమర్లను ఆకర్షించేవారు. వారు అసలు డబ్బుతో వచ్చినప్పుడు, ముఠాలోని ఇతర సభ్యులు నకిలీ పోలీస్ ఐడీ కార్డులు, వాకీ-టాకీలు, డమ్మీ పిస్టల్‌తో పోలీసుల వేషంలో అక్కడికి వచ్చేవారు. నకిలీ నోట్ల దందా చేస్తున్నారంటూ కస్టమర్లను బెదిరించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించేవారు. దీంతో భయపడిన బాధితులు తమ వెంట తెచ్చుకున్న అసలు డబ్బును అక్కడే వదిలి పారిపోయేవారు. ఈ విధంగా ఇద్దరు కస్టమర్ల నుంచి రూ.2 లక్షలు, రూ.3 లక్షలు దోచుకున్నట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితుడు కరుణాకర్, యూట్యూబ్ వీడియోలు చూసి అసలు రూ.500 నోటును స్కాన్ చేసి, ఫోటోషాప్‌లో ఎడిట్ చేసి నకిలీ నోట్లను ఎలా ప్రింట్ చేయాలో నేర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్ట్ చేసిన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా, వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఈ కేసులో పరారీలో ఉన్న జెల్లి వెంకటేష్, కుంజ బాలరాజు, కంపసాటి శ్రీనివాస్ అనే మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ రాకెట్ వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'పుర'పోరులో

కూటమి ప్రభంజనం

ఆత్మకూరు(నంద్యాల), తాడిపత్రి, కళ్యాణదుర్గం, పెనుకొండ, గుత్తి, కమలాపురం, రాజంపేట, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, మదనపల్లి, పుంగనూరు, రాయచోటి, సూళ్లూరుపేట, వెంకటగిరి, పులివెందుల, పలమనేరు, కుప్పం, నగరి.జనసేన: తెనాలి, తుని, దర్శి, గొల్లప్రోలు, సామర్లకోట, పిఠాపురం, తిరువూరు, ముమ్మిడివరం, నిడదవోలు, అమలాపురం, పెడన, నర్సాపూర్, మడకశిర, పుట్టపర్తి. బీజేపీ: ఎలమంచిలి, ఎర్రగుంట్ల, గూడూరు(కర్నూలు). మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ ఇవ్వగా 8 చోట్ల పూర్తిగా ఏకగ్రీవాలు అయ్యాయి. మిగతా 92 పురపాలికల్లో పోలింగ్ నిర్వహించగా.. 138 కౌంటింగ్ కేంద్రాల్లో 556 కౌంటింగ్ హాళ్లు, 6,831 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసి ఓట్లను లెక్కించి విజేతల్ని ప్రకటిస్తున్నారు. మొత్తం 6,831 మంది సూపర్‌వైజర్లు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించగా.. 13,662 మంది సిబ్బంది విధులు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఈ-లాటరీ

లబ్ధిదారులను ఈ-లక్కీ డ్రా విధానంలో ఎంపిక చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు మంత్రి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, హౌసింగ్ ఎండీ గౌతమ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉపాధి ఎక్కడ ఉంటే.. ఇల్లు అక్కడే!

ప్రజా ప్రభుత్వంలో ఒక్కో నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మొదటి విడతలో 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2 వేల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

మొదటి విడతలో మంజూరైన ఇళ్లలో చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయని, నిబంధనల ప్రకారం దశలవారీగా లబ్ధిదారులకు నిధులు విడుదల చేస్తున్నామని వివరించారు. గతంలో ఉపాధి ఒకచోట ఉంటే, ఇల్లు మరోచోట ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకే ఉపాధి ఎక్కడ ఉంటే ఇల్లు అక్కడే ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు.

అర్హులైన వారు కొత్తగా పేర్లు నమోదు చేసుకోండి

హైదరాబాద్‌లో ప్రభుత్వ స్థలాల కొరత ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి అత్యంత విలువైన స్థలాన్ని కేటాయించి, అక్కడ అత్యాధునిక ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహిస్తామని వెల్లడించారు. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డులు లేని వారికి ప్రభుత్వం కార్డులు అందిస్తుందని, కొత్తగా అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

మహిళా సంఘాల్లో చేరండి

ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని, మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలతో పాటు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని మంత్రి వివరించారు. హైదరాబాద్‌లో మహిళా సంఘాల సభ్యత్వం తక్కువగా ఉందని, మహిళలు పెద్ద సంఖ్యలో సంఘాల్లో చేరాలని కోరారు.

మరో 2 వేల మందికి ఇళ్ల మంజూరు

ఎల్1 కింద స్థలం ఉండి సొంతంగా ఇల్లు నిర్మించుకునే అర్హులకు కూడా త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ కేటగిరీలో సుమారు 2 వేల మంది ఉన్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు

కూటమి సుపరిపాలనకు

ప్రజలు అండగా నిలిచారు

విశ్వాసం ప్రజల్లో ఉందని అందుకే పట్టణ ప్రాంత స్థానిక ఎన్నికల్లో ప్రజల మద్దతు లభించిందని చెప్పారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే పాలన సాగిస్తున్నామని స్పష్టం చేశారు. రాజకీయాలా? ప్రజా సమస్యల పరిష్కారమా.? అని నిర్ణయించుకోవాల్సి వస్తే తాను సమస్యల పరిష్కారనికే ప్రాధాన్యత ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

అమరావతి నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తున్నాం

రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు సేవలందించే క్రమంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని గుర్తించి సరిదిద్దుకుంటున్నామని, ప్రజలు మెచ్చే పాలన అందించడంతో పాటు వారి ఇబ్బందులను తొలగించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేశామని చంద్రబాబు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్నామని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని అందించామని గుర్తుచేశారు. అమరావతి నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. గత పాలకులు రోడ్లను ధ్వంసం చేస్తే తమ ప్రభుత్వం తిరిగి రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు.

గుడ్ పాలిటిక్స్.. గుడ్ గవర్నెన్స్

రాష్ట్రంలో అన్ని సమస్యలూ పరిష్కారమైపోయాయని తాము చెప్పడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత పాలకుల నుంచి వారసత్వంగా వచ్చిన అనేక సమస్యలు ఇంకా ఉన్నాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. రాజకీయ పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రభుత్వం ప్రజలందరికీ సేవలు అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు.

గుడ్ పాలిటిక్స్ గుడ్ గవర్నెన్స్ ఇదే తన విధానమని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలే తమకు అండగా నిలుస్తారనేది తన నమ్మకం అన్నారు. ఇదే విధంగా కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

24 గంటలు గడిచిపోయాయి

ఇప్పటికైనా రండి

కూర్చోబెట్టండి, రండి, మనం చర్చిద్దామంటూ రాహుల్ ప్రధాని మోడీకి తెలిపారు. ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది, ఎందుకు జరిగింది, ఇంత వేగంగా ఎందుకు జరిగింది, మీరు ఒక్కరే ఎందుకు నిర్ణయం తీసుకున్నారు, క్యాబినెట్‌కు ఎందుకు చెప్పలేదు, ఎప్ స్టీన్ వ్యవహారం, ఇలాంటి అనేక అంశాలపై బహిరంగంగా చర్చిద్దామన్నారు. పాలల్లో నీళ్లు కలిపితే ఎలా వేరు చేస్తారో, అలా నిజానిజాలను తేల్చేద్దామన్నారు.
నాపై ఆరోపణలు చేస్తున్నారు కదా? రండి, అన్నీ స్పష్టమవుతాయని ప్రధానికి రాహుల్ గాంధీ సవాల్ చేశారు. ఇతర విషయాల్లో అయితే నాపై పరువు నష్టం దావాలు వేశారు, బహుశా నాపై సుమారు 45 పరువు నష్టం దావాలు ఉన్నాయన్నారు. కానీ ఈ చర్చా అంశంపై, విదేశీ సంబంధాల విషయంలో మాత్రం మీరు ఎందుకు పరువు నష్టం దావా వేయడం లేదన్నారు. వేయండి చూద్దాం, దానిపై కూడా బహిరంగంగా చర్చిద్దాం. రండి, వీటన్నింటి గురించి మాట్లాడుకుందాం అన్నారు. చివరిగా ప్రధాని మోడీకి దీపావళి శుభాకాంక్షలు కూడా తెలిపారు.

తెలంగాణ అసెంబ్లీకి కొత్త రూపు

వైస్ ఛైర్మన్, డిప్యూటీ స్పీకర్‌తో పాటు శాసనసభ, శాసన మండలి కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణంపై సీఎస్ సమీక్షించారు. ఈ నిర్మాణాలకు అనువైన స్థలాలు, అందుబాటులో ఉన్న భూమి, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత భవనాలకు అనుబంధంగా పరిపాలనా భవనాలు నిర్మించడంతో పాటు శాసనసభా పక్ష కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది.ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక భవనం, క్రీడా మైదానం ఏర్పాటు వంటి అంశాలనూ మాస్టర్ ప్లాన్‌లో చేర్చాలని అధికారులు వివరించారు. శాసనసభ సమావేశాలు జరిగే సమయంలో ప్రాంగణంలో వాహనాల రద్దీ పెరుగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, సందర్శకుల వాహనాల కోసం సరిపడా పార్కింగ్ సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రాంగణంలో పార్కింగ్ స్థలాన్ని విస్తరించడం, వాహనాల రాకపోకలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం వంటి అంశాలపై సమీక్షలో చర్చించారు.ప్రాంగణ విస్తరణకు అవసరమైన అదనపు భూముల లభ్యతపైనా అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా పర్యాటక శాఖకు చెందిన భూమిని శాసనసభకు బదిలీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. సమీపంలోని డీజీపీ కార్యాలయానికి చెందిన కొంత భూమిని కూడా కేటాయించే అవకాశాలపై చర్చించారు. ఆయా భూముల ప్రస్తుత వినియోగం, బదిలీకి ఉన్న అవకాశాలు, అభివృద్ధి పనులకు వాటిని ఎలా ఉపయోగించవచ్చనే అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు.శాసనసభ ప్రాంగణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నప్పటికీ పచ్చదనాన్ని కాపాడటానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. భవనాల నిర్మాణం పేరుతో ఇప్పటికే ఉన్న చెట్లు, పచ్చని వాతావరణానికి ఎలాంటి విఘాతం కలగకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు అధికారులు తెలిపారు. పర్యావరణహిత విధానాలు, సుస్థిర అభివృద్ధి ప్రమాణాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం సూచించారు. ప్రాంగణంలో పచ్చదనాన్ని కొనసాగిస్తూనే ఆధునిక భవనాలు, పార్కింగ్, రవాణా సదుపాయాలను సమన్వయం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తగ్గించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.సీఎస్ సంజయ్ జాజు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రతిపాదిత నిర్మాణాలకు గుర్తించిన స్థలాలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఈ అంశాలన్నీ ప్రతిపాదనలు, పరిశీలన దశలోనే ఉన్నాయి. మాస్టర్ ప్లాన్‌కు తుది రూపు ఇచ్చి, భూముల బదిలీ, నిర్మాణాలపై అవసరమైన నిర్ణయాలు తీసుకున్న తర్వాతే పనుల అమలుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలకు కొత్త రూపురేఖలు రానున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు అసెంబ్లీ ప్రాంగణం మరింత ఆధునికంగా మారనుంది.

నవంబర్ 3న అమెరికాలో

మధ్యంతర ఎన్నికలు

- అధ్యక్షుడి పదవీకాలం సగం పూర్తయ్యాక ఈ ఎన్నికల నిర్వహణ

వాషింగ్టన్ అ మెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మా రిపబ్లికన్ పార్టీని గెలిపిస్తే.. 18 ఏళ్లు నిండిన అమెరికన్లందరికీ 5 వేల డాలర్ల చొప్పున ఇస్తానంటూ ఆకర్షణీయమైన హామీ కూడా ఇచ్చారు. అయితే మధ్యంతర ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం అంత తేలిక కాదని చరిత్ర చెబుతోంది. అమెరికాలో అసలు మధ్యంతర ఎన్నికలు ఎందుకు నిర్వహిస్తారు...? ఈ ఎన్నికల్లో ఓడిపోతే అధ్యక్షుడిపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? అనే వివరాలు చూద్దాం.అమెరికాలో నాలుగేళ్లకు ఓసారి అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయనే సంగతి తెలిసిందే. ఈ నాలుగేళ్ల పదవీకాలంలో సరిగ్గా సగం పూర్తవగానే జరిగే చట్టసభల ఎన్నికలనే మధ్యంతర ఎన్నికలు అని పిలుస్తారు. అధ్యక్షుడి పాలన పట్ల ప్రజలు ఇచ్చే రెఫరెండంలా దీన్ని భావించొచ్చు.అమెరికా చట్టసభల్లో సీట్లు ఇలా..మన దగ్గర లోక్ సభ, రాజ్యసభ ఉన్నట్లే.. అమెరికా పార్లమెంట్‌లోనూ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్ ఉంటాయి. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రతినిధుల సభ లేదా దిగువ సభ)లో 435 స్థానాలు ఉండగా.. సెనేట్‌లో మొత్తం 100 స్థానాలు ఉంటాయి. దిగువ సభ సభ్యులు పదవీ కాలం రెండేళ్లు. కాబట్టి మధ్యంతర ఎన్నికల్లో మొత్తం 435 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మన రాజ్యసభ సభ్యుల్లాగే సెనేటర్ల పదవీ కాలం ఆరేళ్లు ఉంటుంది. సెనేట్‌లో మూడో వంతు స్థానాలకు ప్రతి రెండేళ్లకు ఓసారి ఎన్నికలు జరుగుతాయి. దిగువ సభలో జనాభా ఆధారంగా రాష్ట్రాలకు సీట్లను కేటాయిస్తే.. సెనేట్‌లో ప్రతి రాష్ట్రానికి రెండు చొప్పున సీట్లు ఉంటాయి..దిగువ సభ పదవీ కాలం రెండేళ్లే.ఈసారి మధ్యంతర ఎన్నికల సమయంలో దిగువ సభలోని 435 స్థానాలతోపాటు ఎగువ సభలోని 35 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అమెరికా ఎన్నికల నిబంధనల ప్రకారం జాతీయ స్థాయి ఎన్నికలను నవంబర్ నెల మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం రోజున నిర్వహిస్తారు. ఈసారి నవంబర్ నెలలో మొదటి సోమవారం రెండో తేదీన వస్తుంది. మంగళవారం నవంబర్ 3న వస్తోంది. కాబట్టే ఆ రోజే అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి.

ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారు

- గండి యాదగిరి



లింగాల గణపురం, నవంబర్, 03 : ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గండి యాదగిరి అన్నారు. జనగామ జిల్లా లింగాల గణపురం మండలం కళ్లెం గ్రామ డెయిరీలో 9 మంది డైరెక్టర్లను గెలిపించి ఆ సొసైటీ పై గులాబీ జెండా ఎగరవేయడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. మంగళవారం ఆయన ఎమ్మెల్సీ ఓటర్స్ ఎన్‌రోల్‌మెంట్ సందర్భంగా వడిచెర్లలో పట్టభద్రులను కలిసి ఓటును నమోదు చేయించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టబద్దరుల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలోనే రైతులు వ్యవసాయం పండుగగా చేసుకున్నారన్నారు. ఎల్ నీనో సాకు చూపుతూ సీఎం రేవంత్ రెడ్డి సాగునీరు అందించలేమని?. కరెంటును సరఫరా చేయలేమని చేతులు ఎత్తడం శోచనీయమన్నారు. ఇలాంటి విపత్తులు ఎదురైనప్పుడు సీఎంగా కేసీఆర్ ఉంటే..ఎల్ నీనో ఏ కాదు ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి అయినా ఎదుర్కొని రైతాంగానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పే వారన్నారు. కరోనా విపత్తు వస్తే అలాంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించి రైతులకు రైతుబంధు నిధులను విడుదల చేసిన సంగతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. పట్టవద్రులు ఈ విషయాలను గమనించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వడిచర్ల ఉప సర్పంచ్ గుగ్గిళ్ల శ్రీకాంత్ నాయకులు గండి వరప్రసాద్, దెయ్యాల గణేష్, రేగు అంజయ్య, విజయ్ కుమార్, భాస్కర్, ఆంజనేయులు, శ్రీశైలం, నాగరాజు, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద ఉద్యమం చేపట్టనున్న ధనుష్..

చెన్నై : కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గురించి ఇప్పుడు ఓ ఆసక్తికర విషయం ఫిల్మ్ వర్గాలతోపాటు సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తుంది. తన అభిమాన సంఘాన్ని ఇకపై స్వచ్ఛంద సంస్థగా మార్చనున్నట్లు ప్రచారం నడుస్తుంది. త్వరలోనే రాజకీయంలోకి అడుగుపెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే ఏవైనా న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి దాదాపు 3వేల మంది న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు రాజకీయాల గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. ఇటీవలే సొంతంగా పార్టీ ప్రారంభించి అఖండమైన మేజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు విజయ్ దళపతి. ఇప్పుడు ఆయన దారిలో మరో హీరో ధనుష్ సైతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హీరో త్వరలోనే రాజకీయ ప్రవేశం చేయనున్నారనే ప్రచారం తమిళనాడు సినీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటివరకు ఈ విషయం పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ నెట్టింట మాత్రం రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో న్యూస్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం ధనుష్ అభిమాన సంఘాన్ని స్వచ్ఛంద సంస్థగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది న్యాయసలహాదారులను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆన స్వచ్ఛంద సంస్థ 234 నియోజకవర్గాల కోసం ఏసీ సౌకర్యాలతో కూడిన ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతుందని ప్రచారం జరుగుతుంది.అభిమాన సంఘం ఒక స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, రాజకీయ మార్గంలో భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు సమాచారం. మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ వీరిని నియమిస్తే, ప్రతి నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని అంటున్నారు. భవిష్యత్తులో ధనుష్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులపై ఉన్న కేసులను పరిష్కరించడంలో, నిరసనల సమయంలో తలెత్తే చట్టపరమైన సమస్యలలో, స్థానిక సమస్యలలో వారు సహాయపడవచ్చని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇటీవల, ధనుష్ స్వచ్ఛంద సంస్థ వరుసగా అనేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, అక్టోబర్ 15, 2026న, ఫ్యాన్ క్లబ్‌ను స్వచ్ఛంద సంస్థగా మార్చి, ఒక జెండా , లోగోను ఆవిష్కరించారు.దీని తర్వాత, అక్టోబర్ 18, 2026న జరిగిన మహిళా బృంద నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న 3,000 మందికి పైగా మహిళా నిర్వాహకులకు ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి దీపాన్ని బహూకరించారు. దీని తర్వాత, జనవరి 2027 నుండి మొత్తం 234 నియోజకవర్గాలలో 10వ, ప్లస్ 2 విద్యార్థుల కోసం ఏసీ సౌకర్యాలతో ఉచిత ట్యూషన్ కేంద్రాలను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ప్రకటించారు. దీనిలో భాగంగా, ఆయన ఢిల్లీలోని ప్రముఖులను కలిశారని, కొత్త పార్టీకి పేరు నమోదు చేశారని వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిలో ఏదీ అధికారికంగా ధృవీకరించబడలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ముందు, తన అభిమాన సంఘాలను 'విజయ్ మక్కల్ ఉద్యమం'గా మార్చి ప్రతి జిల్లాలో సంక్షేమ సహాయం అందించారు. ఆ తర్వాత, ఆయన పార్టీని ప్రారంభించి, తాను పోటీ చేసిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. ధనుష్ కూడా అభిమాన సంఘాన్ని ఒక ఉద్యమంగా మార్చడం, నియోజకవర్గాల వారీగా నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం, ప్రజా సంక్షేమ పనుల్లో నిమగ్నమవడం వంటి అదే మార్గాన్ని అనుసరించడం ప్రారంభించారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తన రాజకీయ ప్రవేశంపై ధనుష్ ఇప్పటివరకు స్పందించలేదు.

కేంద్ర ఉద్యోగులకు పెరగనున్న డీఏ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కరువు భత్యం , కరువు ఉపశమనంలను 3 శాతం పాయింట్లు పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉద్యోగుల డీఏ, పింఛనుదారుల డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరగనున్నాయి. దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పింఛనుదారులు ప్రయోజనం పొందనున్నారు.డీఏ పెంపు ఉద్యోగుల ప్రాథమిక వేతనంపై ఆధారపడి ఉంటుంది. అంటే ప్రాథమిక వేతనంలో 3 శాతం పాయింట్ల మేరకు అదనపు భత్యం లభిస్తుంది. ఉదాహరణకు, రూ.18,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం 60 శాతం డీఏ ప్రకారం రూ.10,800 లభిస్తోంది. కొత్త రేటు 63 శాతానికి చేరితే ఈ మొత్తం రూ.11,340 అవుతుంది. అంటే నెలకు అదనంగా రూ.540 అందుతుంది. అలాగే, రూ.35,400 ప్రాథమిక వేతనం ఉన్న ఉద్యోగికి నెలకు రూ.1,062 అదనంగా లభిస్తుంది. రూ.50,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి నెలవారీ డీఏ రూ.30,000 నుంచి రూ.31,500కు పెరుగుతుంది. దీంతో నెలకు రూ.1,500 అదనపు ప్రయోజనం కలుగుతుంది.మోదీ సర్కార్ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకూ ప్రయోజనం కలుగుతుంది. వారి అర్హతగల ప్రాథమిక పింఛనుపై డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరుగుతుంది. దీంతో నెలవారీ పింఛను ఆదాయంలో పెరుగుదల ఉంటుంది.డీఏ, డీఆర్ పెంపుతో కేంద్ర ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ.10,016 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనున్నట్లు సమాచారం. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావాన్ని తగ్గించి, ఉద్యోగులు, పింఛనుదారులకు ఆర్థిక ఊరట కల్పించడం ఈ నిర్ణయం ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు జనవరి 1, జూలై 1 తేదీల నుంచి అమలయ్యేలా డీఏ, డీఆర్ రేట్లను సవరిస్తుంది. అయితే తాజా పెంపు అమలు తేదీ, బకాయిల చెల్లింపుపై తుది స్పష్టత కోసం అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది.

కమలానికి దగ్గరవుతున్నచిరంజీవి

హైదరాబాద్ : మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో అందరి వాడు. పరిశ్రమకు పెద్ద దిక్కు. ఆయన పెద్దరికం మీద అందరికీ నమ్మకం ఉంది. అనేక సమస్యలను ఆయన పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇక చిరంజీవి స్వభావానికి రాజకీయాలు పడవని సన్నిహితులు అంటారు. ఆయన మెత్తని స్వభావం కలిగిన వారు. అందుకే ఆయన రాజకీయాల్లోకి ఎంత తొందరగా వెళ్లాలో అంతే వేగంగా వెనక్కి తిరిగారు. అది కూడా ఎలాంటి విమర్శలు పెద్దగా లేకుండానే గౌరవంగా తప్పుకున్నారు. ఇక తన జీవితం అంతా సినిమాలకే అంకితం అని ఆయన పదే పదే అనేక సార్లు చెప్పి ఉన్నారు. అయినా సరే మెగాస్టార్ చుట్టూ ఎపుడూ రాజకీయ ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆయన విషయంలో మరోసారి అలాంటి వార్తలే ప్రచారంలో ఉంటూ వస్తున్నాయి. అమిత్ షాతో భేటీ : ఇదిలా ఉంటే హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి బీజేపీ అగ్ర నేత అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి ఆయన కుమారుడు రామ్ చరణ్ తో పాటుగా వెళ్ళి కలిశారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నా కూడా చిరంజీవి రాజకీయం గురించి మరోసారి చర్చించే విధంగా వార్తా కథనాలు అల్లుతున్న వారూ ఉన్నారు. అయితే అమిత్ షాను కలిసిన ప్రముఖులలో అనేక రంగాలకు చెందిన వారు ఉన్నారు. అందులో మై హోం నుంచి రామేశ్వరరావు, అలాగే ఒక ప్రముఖ తెలుగు టీవీ చానెల్ అధినేత ఇంకా అనేక మంది ఉన్నారు. అయితే అందరి దృష్టి మాత్రం మెగాస్టార్ మీదనే ఉంది. ఎందుకంటే ఆయన సినీ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి, అంతే కాదు జనసేన అధినేత పవన్ కి సోదరుడు కాబట్టి అని అంటున్నారు. ఇక పవన్ ఏపీలో కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా ఉన్నారు. ఆ కూటమిలో బీజేపీ కూడా ఉంది. అలా ఆ బంధాన్ని కూడా కలుపుతూ చిరంజీవి రాజకీయాల మీద చర్చించే వారూ ఉన్నారు. అయితే అమిత్ షాని చిరంజీవి కలవడం వెనక రాజకీయం లేదని అంటున్నారు. కేవలం మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్ సినీ రంగం పరిస్థితులలో పాటు తమ సినిమాల గురించి చర్చకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇక చిరంజీవి విషయానికి వస్తే ఆయన రాజకీయంగా అందరి వాడుగా ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఆయనకు పార్టీలతో సంబంధం లేదని కూడా అంటున్నారు. ఏపీలో ఈ మధ్య పర్యటించిన మెగాస్టార్ కూటమి ప్రభుత్వం పాలన బాగుందని చెప్పారని అంటున్నారు. అలాగే రేవంత్ రెడ్డితో కూడా అనేక వేదికలు పంచుకున్నారని అంటున్నారు. ఇలా అందరి వాడుగా ఉంటూ వస్తున్న చిరంజీవి రాజకీయాలలో క్రియాశీలకం అవుతారు అన్నది కేవలం ఊహాగానాలే అని అంటున్నారు.అయితే కమలం పార్టీకి ఆశలు మాత్రం ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ కూటమిలో ఉన్నారు. చిరంజీవి వంటి బిగ్ ఫిగర్ కనుక తమతో ఉంటే తెలంగాణాలో కూడా అధికారానికి మరింత సులువు అవుతుందన్న లెక్కలు బీజేపీకి ఉన్నాయని చెబుతున్నారు. అయితే చిరంజీవి తిరిగి రాజకీయాల్లోకి వస్తారా అంటే అది ఈజీ కాదు కదా అసలు కుదిరే వ్యవహారం కానే కాదని అంటున్నారు. ఒక విధంగా చిరంజీవి రాజకీయం అన్నది ముగిసిన అధ్యాయం అని కూడా అంటున్నారు. అయితే కాలం ఎపుడూ గొప్పది చూడాలి మరి ఊహాగానాలు అలాగే ఉంటాయా లేక ఏమవుతాయి అన్నది.

ఖాళీ కుర్చీలను మార్ఫింగ్‌తో కవర్ చేసుకుంటున్నారు

హైదరాబాద్ పది లక్షల మందితో దండయాత్ర అని బిల్డప్ ఇచ్చి.. రాంలీలా మైదానంలో 30 వేల మందిని కూడా పోగుచేయలేక ఖాళీ కుర్చీలను మార్ఫింగులతో కవర్ చేసుకుంటున్నారని బిజెపి నేత – ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యేచింతల రామచంద్రారెడ్డి విమర్శించారు.ఇటీవల కర్ణాటక, బీహార్ వంటి రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే చిత్తుగా ఓడిపోయిన కాంగ్రెస్.. ఇప్పుడొచ్చి ఈవీఎంలు, 'ఓట్ చోరీ' అంటూ దొంగ ఏడుపులు ఏడవడం సిగ్గుచేటు. రాహుల్ జీ, జిమ్మిక్కులతో ఎవరూ పీఎం కాలేరు.. దేశాన్ని బదనాం చేసే మీ అబద్ధాల దుకాణాన్ని ప్రజలు ఎప్పుడో మూసేశారని వ్యాఖ్యానించారు.

అనకాపల్లి జిల్లాలో అగ్నిప్రమాదం

అనకాపల్లి ఎస్.రాయవరం మండలం, పెనుగొల్లు సమీపంలో జాతీయరహదారిపై ఐషర్ వ్యాన్ దగ్ధం అయింది. అప్రమత్తం అయిన డ్రైవర్, వాహనాన్ని పక్కకు ఆపివేసాడు. వ్యాన్ లో నుండి దిగిపోయాడు. వాహనం రాత్రి విశాఖ వైపు నుండి తుని వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సడన్ గా ఇంజిన్ లోనుండి షార్ట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది, మంటలను అదుపుచేసారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు

హైదరాబాద్ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో పాటు వారి వ్యాపారాల విస్తరణకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, విధానపరమైన సహకారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (చిఇఇఅ)ను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. సచివాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామిక రంగంలో మరింతగా ఎదిగేందుకు అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మహిళలు కేవలం చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా భారీ పరిశ్రమలు, స్టార్టప్‌లు, వివిధ వ్యాపార రంగాల్లోనూ తమదైన ముద్ర వేయాలన్నది ఈ కౌన్సిల్ ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.డిసెంబరు 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ నేపథ్యంలో ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు సీతక్క వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తలతో పాటు పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, ఇతర కీలక భాగస్వాములకు ఇందులో భాగస్వామ్యం కల్పించినట్లు తెలిపారు. మహిళలు ప్రారంభించిన వ్యాపారాలకు పెట్టుబడులు సమకూర్చడం, కొత్త మార్కెట్లను పరిచయం చేయడం, వ్యాపార విస్తరణకు అవసరమైన ప్రభుత్వ విధానపరమైన మద్దతు అందించడం వంటి అంశాల్లో ఈ కౌన్సిల్ కీలక పాత్ర పోషించనుంది.మహిళా పారిశ్రామిక రంగంలో ప్రస్తుతం ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలను సమగ్రంగా విశ్లేషించి ప్రత్యేక శ్వేతపత్రాన్ని రూపొందించనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ శ్వేతపత్రాన్ని గ్లోబల్ సమిట్‌లో విడుదల చేస్తామని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థికంగా, సాంకేతికంగా, విధానపరంగా ఎలాంటి సహకారం అవసరమో ఇందులో పొందుపరచనున్నారు. కౌన్సిల్ కన్వీనర్ పల్లచోళ్ల సీతతో పాటు పలువురు ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఇదిలా ఉండగా.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నవీన్ మిత్తల్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పరిపాలనా బాధ్యతలను ఆయన చేపట్టారు.

పులివెందులలో వైసీపీ పోలింగ్ ఏజెంట్లను తరిమికొట్టారు

- సతీశ్ కుమార్ రెడ్డి
- పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్న సతీశ్ రెడ్డి
- చివరకు జగన్ ను కూడా ఇబ్బంది పెట్టారని ఆవేదన
- వైసీపీపై కూటమి ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని మండిపాటు



ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్... ముఖ్యంగా పులివెందులలో, తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అధికార కూటమి ప్రభుత్వం రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో మాట్లాడుతూ అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పులివెందులలో తమ పార్టీ ఏజెంట్లను సుమారు 70 పోలింగ్ బూత్‌ల నుంచి తరిమికొట్టి యథేచ్ఛగా రిగ్గింగ్ చేశారని ఆయన ఆరోపించారు. ఎన్నికల సరళిని కవర్ చేయడానికి వెళ్లిన 'ఇండియా టుడే' జర్నలిస్టులు అబ్దుల్ బషీర్, వీడియో జర్నలిస్ట్ విజయ్‌పై అధికార పార్టీ వర్గాలు దాడి చేసి కెమెరాను ధ్వంసం చేశాయని ఆయన మండిపడ్డారు. పులివెందులలో టీడీపీ గూండాల దాడిన తీవ్రంగా ఖండిస్తున్నానని సతీశ్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి వైసీపీపై కూటమి ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరించిందని మండిపడ్డారు. పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లు ఉంటే... 70 బూత్‌ల నుంచి వైసీపీ ఏజెంట్లను తన్ని తరిమేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఏకమై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. చివరకు తమ పార్టీ అధినేత జగన్ ను కూడా ఇబ్బంది పెడుతున్నారని సతీశ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇది అత్యంత ప్రమాదకరమని చెప్పారు.

స్పందన రాని అమిత్ షా రోడ్ షో

- అద్దంకి దయాకర్,

హైదరాబాద్ రాహుల్ గాంధీ ర్యాలీ దెబ్బకు అమిత్ షా హైదరాబాద్ రోడ్లపై పడి పోటీ ర్యాలీ చేశాడు. అమిత్ షా ర్యాలీకి బీజేపీ కార్యకర్తలు, ప్రజల నుంచి కూడా స్పందన రాలేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్పై ఉందని అమిత్ షా అంటున్నాడు.. కానీ బీజేపీ క్రిటికల్ ఐసీయూలో ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మోదీ, అమిత్ షా అనే ముసలి నక్కల పాలన పోవాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మోదీ, అమిత్ షా ట్యాక్స్ కడుతున్నారా..? మీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి అక్రమాలు జరుగుతుంటే పట్టించుకోరు.. నిజాయితీగా పరిపాలిస్తున్న రేవంత్ రెడ్డిని దింపాలని మాట్లాడుతున్నారు.. రేవంత్ రెడ్డిని దింపడం కాదు.. కేంద్రంలో మిమ్మల్ని దింపుతాం చూసుకోండని అన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఆరు గ్యారెంటీలను మా ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారు. కేంద్రం నుంచి పైసా సాయం కూడా చేయకుండా విమర్శలు చేస్తారా..? ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను మా ప్రజా ప్రభుత్వం ఇస్తోంది. తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనివ్వరు. తెలంగాణలో బీజేపీకి అధికారం ఎప్పటికీ సాధ్యం కాదు. ప్రధాని మోదీ నుంచి బీజేపీ ఎంపీల వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. రేవంత్ రెడ్డినే భవిష్యత్తులో రాహుల్ గాంధీకి ప్రధాన ఆయుధంగా అవుతాడన్న ఉద్దేశంతోనే అమిత్ షా హైదరాబాద్ వచ్చారు. బీజేపీ పతనం మొదలైంది... ముందు అది గుర్తుపెట్టుకోండని అన్నారు..

అసిస్టెంట్ జిహెచ్ఎంసి డైరెక్టర్ ఆస్తులపై ఏసీబి సోదాలు

సూర్యాపేట సూర్యాపేట లో ఉన్న హైదరాబాద్ అసిస్టెంట్ జిహెచ్ఎంసి డైరెక్టర్ నల్లబోతు యాదగిరి ఇంటిపై ఏసీబీ సోదాలు జరిపింది. పలు ప్రాంతాల్లో ఉన్న యాదగిరి ఆస్తులపై ఏసీబీ ర్యాప్తు జరుపుతోంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లో నివాసం వుంటున్నారు..

భవనం పైనుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

మేడ్చల్ చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మింట్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది రెండో అంతస్తు భవనం పైనుంచి దూకి ఇంటర్ సెకండియర్ చదువుతున్న తనీషా అనే యువతి ఆత్మహత్య పాల్పడింది . వ్యక్తిగత వ్యవహారంలో తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు.ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చర్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

మేడ్చల్ జీడిమెట్ల సీఎంసీ సర్కిల్లోని పారిశుధ్య కార్మికులు .సూపర్వైజర్.శివరామకృష్ణ .వేధింపులు.తట్టుకోలేకపోతున్నామని పనులు బంద్ చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మూడుగుళ్ల దేవాలయం ముందు పారిశుధ్య కార్మికులు బైటాయించారు. మహిళా కార్మికులు మాట్లాడుతూ సూపర్వైజర్ ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని ఇష్టానుసారంగా తిట్టడం ఎట్లా పడితే అట్లా మాట్లాడుతున్నాడని అతడు వద్దంటే మాకు వద్దని డియుముందు తమ గోడును వెల్లబోసుకున్నారు లక్ష రూపాయలు తీసుకొని విధులను తీసుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డి ఈ శివ ప్రకాష్ ముందు ఆవేదన వ్యక్తం చేసారు.సూపర్వైజర్ శివరామకృష్ణ మాట్లాడుతూ పని నేను ఎక్కువ చెప్తున్నాను కాబట్టి నా మీద ఆరోపణలు చేసి నన్ను పక్కకు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వారి వద్ద నేను ఒక రూపాయి తీసుకున్న ప్రూఫులు చూపెట్టాలని అన్నారు

రాప్తాడు దాడి నిందితుడి కుడి కాలు తొలగింపు

- కొనసాగుతున్న చికిత్స
- పోలీసుల కాల్పుల్లో గాయపడటంతో అనివార్యమైన శస్త్రచికిత్స
- సోమవారం అర్ధరాత్రి అనంతపురం జీజీహెచ్‌లో ఆపరేషన్ పూర్తి
- అరెస్టును ప్రతిఘటించి దాడికి యత్నించడంతో పోలీసుల కాల్పులు
- ప్రస్తుతం ఐసీయూలో చికిత్స.. నిలకడగా ఆరోగ్యం



అనంతపురం రాప్తాడులో ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థినిపై చైన్‌సాతో దాడికి పాల్పడిన నిందితుడు హేమంత్ తన కుడి కాలును కోల్పోయాడు. అరెస్టు సమయంలో పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడటంతో, వైద్యులు అతడి కాలును తొలగించాల్సి వచ్చింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (జీజీహెచ్) ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో హేమంత్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో అతడు లొంగిపోకుండా ప్రతిఘటించడమే కాక, ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దాడికి ప్రయత్నించాడు. పోలీసులు హెచ్చరికగా కాల్పులు జరిపినా వెనక్కి తగ్గకపోవడంతో, ఆత్మరక్షణ కోసం నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో హేమంత్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే, కుడి కాలిలో రక్త ప్రసరణ పూర్తిగా నిలిచిపోయి కణజాలం దెబ్బతినడంతో, మోకాలి పైభాగం నుంచి కాలును తొలగించడం తప్పనిసరి అయింది. దెబ్బతిన్న రక్తనాళాల కారణంగా ఎడమ కాలికి కూడా వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం హేమంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని వైద్యులు వెల్లడించారు. అక్టోబర్ 31న రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి గదిలోకి చొరబడిన హేమంత్, చైన్‌సాతో ఇద్దరు విద్యార్థినులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గోపిక అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడగా, బెంగళూరులో చికిత్స అనంతరం కోలుకుంటోంది. ఆమెను కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఏపీ లిక్కర్ స్కామ్‌లో అంబటికి ఈడీ సమన్లు

- విచారణకు హాజరుకావాలని ఆదేశం
- మద్యం రవాణా టెండర్ల కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలు
- హైదరాబాద్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అంబటికి ఈడీ నోటీసులు
- అనారోగ్య కారణాలతో గతంలో విచారణకు హాజరుకాని అంబటి



హైదరాబాద్ వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా టెండర్ల కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్ల విధానాన్ని మార్చడం ద్వారా భారీగా అక్రమాలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 200 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే అంబటి రాంబాబుకు నోటీసులు పంపింది. అయితే, తనకు ఇటీవల గుండెకు స్టెంట్లు వేశారని, ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు తప్పక హాజరవుతానని అంబటి గతంలో ఈడీకి సమాచారం ఇచ్చారు. ఈడీ నోటీసుల వెనుక రాజకీయ కక్ష సాధింపు ఉందని ఆయన ఆరోపిస్తున్నారు. తనను బెదిరించాలని చూస్తున్నారని, అయితే తాను భయపడబోనని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో అంబటి అనుచరులుగా భావిస్తున్న మర్రి సుబ్బారెడ్డి, రాయపాటి పురుషోత్తంలను ఈడీ ఇప్పటికే సుదీర్ఘంగా విచారించింది. విచారణకు హాజరయ్యేటప్పుడు పాన్ కార్డ్, ఆధార్, పాస్‌పోర్ట్‌తో పాటు 2019 నుంచి కుటుంబ సభ్యుల పేరిట ఉన్న కంపెనీలు, బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకురావాలని ఈడీ తన నోటీసుల్లో పేర్కొంది. ఈడీ ఆదేశాలతో ఈ కేసులో తదుపరి ఏం జరగనుందనే విషయంపై ఆసక్తి నెలకొంది.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్

- బంజారాహిల్స్ లో మొక్కలు నాటిన బిగ్ బాస్ 10 కాంటెస్టెంట్ సింగర్ ఝాన్సీ

హైదరాబాద్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా బిగ్ బాస్ 10 కాంటెస్టెంట్ సింగర్ ఝాన్సీ బంజారాహిల్స్ లో మొక్కలు నాటారు. ఝాన్సీ మాట్లాడుతూ బిగ్ బాస్ నుండి బయటకు రాగానే ప్రకృతి తో ముడిపడి ఉన్న నాకు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్క నాటడం చాలా ఆనందంగా ఉంది అన్నారు.దమ్మిట్టిని తాకిన మనసుకు అనే పాటను పాడి మొక్కను నాటడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.సకల జీవ రాశుల మనుగడకు మొక్కలు ఎంతో అవసరం అని వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మన మీదే ఉందని అన్నారు.మొక్కలు నాటి వాటిని రక్షన చేస్తేనే రేపటి తరాలకు మంచి వాతావరణం ఇచ్చిన వాళ్ళము అవుతాము అన్నారు. నీళ్లనే కొనుక్కోవాల్సిన అవసరం వస్తది అని ఎవరు అనుకోలేదు కానీ వచ్చింది అని ఆక్సీజన్ కొనుక్కునే పరిస్థితి రేపటి తరాలకు రావద్దు అంటే మొక్కలు నాటాలి అన్నారు.ఇంతటి గొప్ప కార్యక్రమం చేపట్టిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, నిరంజన్ పూలే తదితరులు పాల్గొన్నారు.

లేడీస్ హాస్టల్లో అగ్నిప్రమాదం

మేడ్చల్ నాచారం పీఎస్ పరిధిలోని లేడీస్ హాస్టల్లో అగ్నిప్రమాదం జరిగింది. స్థానిక సావర్కర్ నగర్లో ఘటన చోటు చేసుకుంది. శ్రీ లక్ష్మి లేడీస్ హాస్టల్లో షార్ట్ సర్క్యూట్తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలతో స్థానికులు భయాందోళనకు గురైయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

హైదరాబాద్ పాతబస్తీలో దారుణ హత్య..

- కాపాడేందుకు వెళ్లిన వ్యక్తిపై కూడా దాడి

హైదరాబాద్ పాతబస్తీ కాంచన బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్ బాబా నగర్‌లో తెల్లవారుజామున దారుణ హత్య జరిగింది . సయ్యద్ ఒమర్ అలియాస్ మషల్లా ఒమర్ అనే యువకుడిపై దుండగులు కత్తితో దాడి చేసి హత్య చేశారు. సంఘటన స్థలంలోనే ఒమర్ ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం తో ఆధారాలు సేకరిస్తున్నారు.ఒమర్‌ను కాపాడేందుకు ప్రయత్నించిన సయ్యద్ అనే వ్యక్తిపై కూడా దుండగులు దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఈ హత్యను అమన్ ఖురేషి, అలీ భైసా అనే వ్యక్తులు చేసారని ఘటనాస్థలంలో ఉన్న కొందరు స్థానికులు తెలిపారు. మృతుడు ఒమర్ నేర చరిత్ర కలిగిన వ్యక్తి మద్యం, గంజాయి మత్తులో ఓ గ్యాంగ్ ని ఏర్పాటు చేసుకొని స్థానికులను బెదిరించడం, దాడులు చేయడం, డబ్బులు వసూలు చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలపై పోలీసుల సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

వ్యవసాయానికి సోలార్ పంపుసెట్లు..

- అధికారులకు రెడ్‌కో సీఎండీ కీలక ఆదేశాలు

హైదరాబాద్ : రాష్ట్రంలో సాగుకు సోలార్ పంపుసెట్లను అందించనున్నట్టు రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన సోలార్ పంపుసెట్ల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టీజీ రెడ్‌కో వీసీ, ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆ సంస్థ అధికారులు, జిల్లా మేనేజర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన పథకాల అమలును వేగవంతం చేసి గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. మాడల్ సోలార్ విలేజ్, రూఫ్‌టాప్ సోలార్, పీఎం కుసుమ్ పథకం, వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్, ఎలక్ట్రికల్ వాహన చార్జింగ్ స్టేషన్లపై ఆయన ఆరా తీశారు. గృహజ్యోతి ఇండ్లపై సోలార్ ప్లాంట్లురూఫ్‌టాప్ సోలార్ పథకంలో భాగంగా గృహజ్యోతి పథకం కింద నిర్మించిన ఇండ్లపై విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆసక్తి చూపిన వారి ఇండ్లపై ప్లాంట్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పీఎం కుసుమ్ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో రెడ్‌కో జీఎం సీఎస్‌వీ ప్రసాద్, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

వరుస తుఫాన్లు...
ఏం జరుగుతోంది

విజయవాడ వారం రోజుల వ్యవధిలో ఏర్పడిన రెండు తుఫాన్లు ఏపీలో వర్షాభావాన్ని పూర్తిగా తగ్గించేశాయనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులపై ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు తుఫాన్లు చాలా మేలు చేశాయని విశ్లేషిస్తున్నారు. తుఫాన్ కారణంగా చాలా నష్టం జరిగినప్పటికీ, భారీ వర్షాల కారణంగా వేసవి సవాళ్లను అధిగమించేలా అవకాశం లభించిందని అంటున్నారు. ప్రస్తుతం చేతికందిన పంట కొంతవరకు దెబ్బతిన్నప్పటికీ, రెండో పంటకు పుష్కలంగా నీరు లభించిందని చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇటు రైతుకు అటు ప్రభుత్వానికి నష్టం జరిగినా, ఎల్ నినో ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా బయటపడటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించినట్లేనని అంటున్నారు. ఎల్ నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంది. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో రాష్ట్రంలో దాదాపు 450 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. పంట దిగుబడులు తగ్గిపోతాయనే ఆందోళన ఎక్కువ కావడంతో మార్కెట్లో అనేక రకాల సరకులకు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో ఎన్నడూ లేనట్లు నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబును రాజకీయంగా ఇరుకన పెట్టేందుకు ప్రత్యర్థులు ఈ వాతావరణ పరిస్థితులను కూడా వాడుకుంటున్నారు. రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నేతలతోపాటు తెలంగాణకు చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు సైతం చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వర్షాలు కురవవు అనే సెంటిమెంటు ద్వారా రాజకీయం చేయాలని చూశారని అంటున్నారు. అయితే అనూహ్యంగా గత వారం రోజుల్లో రెండు తుఫాన్లు ఏర్పడటంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితుల నుంచి బయటపడిందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత నెల 28న కోనసీమ తీరాన్ని తాకిన అర్నబ్ తుఫాన్ వల్ల శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలే కురిశాయి. ఈ వర్షాల కారణంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాదాపు 20 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ వర్షాల వల్ల జరిగిన నష్టానికి సమానంగా మేలు కూడా జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదపు కోస్తా ప్రాంతంలో పుష్కలంగా నీరు చేరిందని, అన్ని చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయని చెబుతున్నారు. వాగులు, వంకలు, గెడ్డలు పొంగిపొర్లడంతో రానున్న వేసవికి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం లేదని విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి ఎల్ నినో కారణంగా 2027 జూన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని అంటున్నారు. దీనివల్ల తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. పొరుగున ఉన్న తెలంగాణలో ఇప్పటికే ఈ సమస్య మొదలైందన్న వార్తలు వస్తున్నాయి. అయితే ఏపీకి మాత్రం రెండు తుఫాన్లు తాగునీటి ముప్పు లేకుండా చేశాయని, అదే సమయంలో రబీ పంటలకు సాగునీటి చింత లేకుండా పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. అర్నాబ్ కారణంగా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలు కురిస్తే, ఇప్పుడు మురసు తుఫాన్ వల్ల ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం, పల్నాడు జిల్లాలతోపాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక ఈ సీజన్ లో చుక్క నీరు కూడా చేరని పులిచింతల, నాగార్జున సాగర్ కు భారీగా వరద వచ్చే అవకాశం ఉందన్న అంచనాలు ఆ ప్రాజెక్టుల కింద ఉన్న రైతుల్లో ఆశలు రేపుతున్నాయని చెబుతున్నారు. మొత్తానికి ఈ పరిస్థితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరటనిస్తున్నట్లుగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన చంద్రబాబు హయాంలో వర్షాభావ పరిస్థితులు ఎదురవడం అత్యంత సహజమే అయినప్పటికీ ఆయన రాజకీయ ప్రత్యర్థులు ప్రకృతి శాపంగా విమర్శలు చేయడం ద్వారా సీఎంను మానసికంగా ఇబ్బంది పెట్టేవారని అంటున్నారు. అయితే ఈ సారి ప్రకృతి ఇలాంటి విమర్శలకు అవకాశం ఇవ్వకుండా తాను చంద్రబాబు పక్షాన ఉన్నట్లు నిరూపిస్తోందని అంటున్నారు. గత ఆగస్టులో కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలకు కృష్ణా, గోదావరి నదులకు ఒకేసారి వరదలు వచ్చాయి. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు లిఫ్ట్ ద్వారా రాయలసీమకు నీటిని తరలించి ఆ ప్రాంతంలో పంటలను కాపాడగలిగారని అంటున్నారు. ఇదే సమయంలో పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసి కృష్ణా డెల్టాకు కరువు ఛాయలు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఇప్పుడు మిగిలిన ప్రాంతంలోనూ తుఫాను కారణంగా వర్షాలు కురిసి నీటి కొరత లేకుండా పోయిందని విశ్లేషిస్తున్నారు. ఇదంతా గమనిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిస్థితులు అనుకూలిస్తున్నట్లుగా భావించాల్సివస్తోందని అంటున్నారు.

కొత్త బాదుడుకు తెర తీసిన రెరా

హైదరాబాద్ : హైదరాబాద్ వ్యాప్తంగా నిర్మాణం జరుపుకుంటున్న లగ్జరీ హైరైజ్ అపార్ట్‌మెంట్లలో నివసించాలని సగటు గృహ కొనుగోలుదారులు ఎంతో ముచ్చటపడతారు. కాలుష్యానికి దూరంగా, ఆహ్లాదకరమైన గాలి, వెలుతురుతో పాటు నగర అందాలను పైనుంచి వీక్షించవచ్చనే ఆశతో చాలామంది పై అంతస్తుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతారు. అయితే కొనుగోలుదారుల ఈ ఆశనే బిల్డర్లు వ్యాపార అవకాశంగా మలచుకుని ఫ్లోర్ రైజ్ ఛార్జీలు పేరుతో అదనపు బాదుడు బాదుతుండటం ప్రాపర్టీ మార్కెట్‌లో చర్చనీయాంశమవుతోంది.సాధారణంగా బిల్డర్లు నిర్ణయించే బేసిక్ ఎస్‌ఎఫ్‌టీ ధర అనేది భవనంలోని దిగువ అంతస్తులకే వర్తిస్తుంది. నిబంధనల ప్రకారం 6వ అంతస్తు నుంచి ప్రారంభించి పైకి వెళ్లే ప్రతి అదనపు అంతస్తుకు చదరపు అడుగుకు రూ. 20 చొప్పున ఫ్లోర్ రైజ్ రుసుముగా అదనంగా జోడిస్తారు. అంటే మీరు భవనంలో ఎంత ఎత్తుకి వెళ్లి, అంత ప్రశాంతతను అనుభవించాలనుకుంటే మీ జేబుకు అంత పెద్ద కన్నం పడుతుందన్న మాట. ఉదాహరణకు 3,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్ కొనుగోలు చేసే వ్యక్తి, 16వ అంతస్తును ఎంచుకుంటే కేవలం ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీల రూపంలోనే రూ. 6.60 లక్షలకు పైగా అదనంగా చెల్లించాల్సి వస్తోంది.ఎత్తైన అంతస్తుల్లో నివసించడం వల్ల మెరుగైన వ్యూ , తక్కువ శబ్దం, పరిశుభ్రమైన గాలి లభిస్తాయని బిల్డర్లు ఈ రుసుములను సమర్థించుకుంటారు. అయితే ఇదే సమయంలో భవనం ఎత్తు పెరిగేకొద్దీ నిర్మాణ వ్యయంలో లిఫ్టుల వేగం, ప్రీమియం గ్లాస్, భద్రతా వ్యవస్థలు , నిర్మాణాత్మక ఇంజనీరింగ్ ఖర్చులు పెరుగుతాయని డెవలపర్లు స్పష్టం చేస్తున్నారు. కానీ ఎలాంటి అదనపు విస్తీర్ణం రాకపోయినా, కేవలం ఎత్తులో ఉందనే ఒకే ఒక్క కారణంతో లక్షల రూపాయల అదనపు భారం మోయాల్సి రావడంపై కొనుగోలుదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.అంతిమంగా చూస్తే ప్రాథమిక ఎస్‌ఎఫ్‌టీ ధర తక్కువగా కనిపించినప్పటికీ, 15, 20 లేదా 30 అంతస్తుల్లో ఫ్లాట్లను ఎంచుకున్నప్పుడు ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీలే లక్షల రూపాయల్లోకి చేరి కొనుగోలుదారుల మొత్తం బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. దీంతోపాటు ఈ అదనపు ధరపై కూడా జీఎస్టీ భారం పడుతుండటం గమనార్హం. అందువల్ల హైరైజ్ ప్రాజెక్టుల్లో ఇళ్లను ఎంచుకునేటప్పుడు కేవలం ఎత్తుకే ప్రాధాన్యమివ్వకుండా, ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీల లెక్కలను ముందే సరిచూసుకుని సరైన అంతస్తును ఎంచుకోవాలని రియల్ ఎస్టేట్ నిపుణులు సూచిస్తున్నారు.

టీటీడీకి కొత్త కమిటీ..

- ముగ్గురు ఉన్నతాధికారులతో 'స్పెసిఫైడ్ అథారిటీ' ఏర్పాటు

తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పదవీ కాలం ఇటీవల ముగియడంతో టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేయడం జరిగింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉంటారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి రెండేళ్ల పదవీ కాలం ఇటీవల ముగిసింది. తిరుమల చరిత్రలో ఇలాంటి స్పెసిఫైడ్ అథారిటీలు ఏర్పాటు కావడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలోనూ పాలకమండలి పదవీకాలం ముగిసి కొత్త బోర్డు ఏర్పాటులో న్యాయపరమైన, సాంకేతిక అడ్డంకులు ఎదురైన సందర్భాల్లో ప్రభుత్వాలు అధికారులతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను నడిపిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఈసారి ఎన్నికల నియమావళి అడ్డంకిగా మారడం, రాజకీయ నియామకాలకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించని కారణంగా .. ప్రభుత్వానికి స్పెసిఫైడ్ అథారిటీని తెరపైకి తేవడం అనివార్యమైంది. అనుభవజ్ఞులైన ఉన్నతాధికారులకే పాలనా పగ్గాలు అప్పగించడం ద్వారా రాజకీయ వివాదాలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా వ్యవస్థను నడిపించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం, కోడ్ ముగిసిన తర్వాతే పూర్తిస్థాయి టీటీడీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉంది. అప్పటివరకు తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించడం, రాబోయే రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయడం, నిధుల వినియోగంలో పారదర్శకతను కాపాడటం ఈ స్పెసిఫైడ్ అథారిటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి. సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో టీటీడీ సమర్థవంతంగా పనిచేస్తూ భక్తుల విశ్వాసానికి తగినట్లుగా నిర్ణయాలు తీసుకుంటుందని దేవదాయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేసింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉండనున్నారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.ఆయనతో పాటు అనుభవజ్ఞులైన మరో ఇద్దరి అధికారులు ఈ కమిటీలో ఉంటారు. ఈ ముగ్గురి టీమ్ శ్రీవారి ఆలయ నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, బోర్డు వ్యవహారాలను పర్యవేక్షించడం జరుగుతుంది. కొత్త టీటీడీ ట్రస్ట్ బోర్డును పునర్వ్యవస్థీకరించే వరకు లేదా ఏడాది కాల పరిమితి పూర్తయ్యే వరకు ఈ స్పెసిఫైడ్ అథారిటీ అమల్లో ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. అలాగే సాధారణ టీటీడీ పాలకమండలికి ఉండే చట్టబద్ధమైన అన్ని అధికారాలు, విధివిధానాలు, నిర్ణయాధికారాలు ఈ కమిటీకి వర్తిస్తాయి. దీనివల్ల కొత్త బోర్డు ఏర్పాటులో జాప్యం జరిగినప్పటికీ భక్తుల సేవలు, శ్రీవారి నిత్యోత్సవాలు, పరిపాలనాపరమైన నిర్ణయాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉంటుంది.అయితే టీటీడీకి ఇలా స్పెసిఫైడ్ అథారిటీ రావడం ఇదే తొలిసారి కాదు.. గతంలో అంటే 2010, 2021లో ఇలాంటి కమిటీలు ఏర్పాటయ్యాయి. 2010లో ఐఏఎస్ జె.సత్యనారాయణ సమక్షంలో, 2021లో అప్పటి ఈవో జవహర్ రెడ్డి చైర్మన్‌గా ప్రభుత్వాలు స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేశారు. బోర్డు లేని సమయంలో పాలన, పనులు, కార్యకలాపాల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకే అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వంలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో కొత్త బోర్డు కూర్పునకు సమయం పట్టే ఛాన్స్ ఉంది. అందుకే పాలన సాఫీగా సాగేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేసింది.

అసైన్డ్, ఇనాం, చుక్కల భూముల
ఫ్రీహోల్డ్ దరఖాస్తులపై కీలక జీవో

విజయవాడ : అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములపై వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల విషయంలో ఏపీ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసింది. ఇలాంటి భూములకు సంబంధించిన ఫ్ రీహోల్డ్ దరఖాస్తులు వెంట వెంటనే పరిష్కరించే విధంగా కాలపరిమితిని విధించింది. దీని ప్రకారం ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలి. అదేవిధంగా తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 659 జారీ చేయడం జరిగింది.రాష్ట్రంలోని అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఈ భూముల ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా.. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన డెడ్‌లైన్లు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 659ను అధికారికంగా రిలీజ్ చేసింది.ఈ కొత్త జీవో ప్రకారం ఆర్డీవో పరిధిలోకి వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల ను ఎక్కువలో ఎక్కువగా రెండు నెలల్లోపు అంటే 60 రోజుల్లోపు కచ్చితంగా పరిష్కరించాల్సి ఉం టుంది. అదేవిధంగా కొన్ని నిర్దిష్ట కేటగిరీలకు చెందిన అప్లికేషన్లను కేవలం నెల రోజుల్లోనే క్లియర్ చేయాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన గడువును నిర్దేశించింది. ఇక తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులకు సైతం 60 రోజుల సమయాన్ని గరిష్ట పరిమితిగా నిర్ణయించింది.ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం రెవెన్యూ శాఖ పోర్టల్లో పలు సాంకేతిక మార్పులను సైతం చేసింది. రైతులు లేదా యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే, ఆ అప్లికేషన్ నేరుగా సంబంధిత తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. దీనివల్ల ఫైళ్ల కదలికలో జరిగే జాప్యానికి పూర్తిగా చెక్ పడినట్టవుతుంది.అలాగే రిజిస్ట్రేషన్ల విషయంలోనూ ప్రభుత్వం రైతు లకు లైన్ క్లియర్ చేసింది. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్‌గా నమోదైన వెంటనే, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని పేర్కొంది. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రత్యేకంగా అధికారుల నుంచి ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్‌ని అందిం చాల్సిన అవసరం ఇకపై ఉండదని వెల్లడించింది. వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేట్ అయిన వివరాలను రికార్డు ల్లో పకడ్బందీగా భద్రపరచాలని, ఈ సరికొత్త గైడ్‌లైన్స్‌ను రెవెన్యూ యంత్రాంగం తప్పకుండా పాటిం చాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కొత్త మార్గదర్శకాల వల్ల భూ వివాదాలకు తెర పడే అవకాశం ఉంది. అలాగే రెవెన్యూ సేవలు మరింత వేగవంతం కానున్నాయి.

విజయసాయిరెడ్డి పార్టీలోకి టీడీపీ నేత

నెల్లూరు : సీనియర్ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆయన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.. పార్టీ ఒంటెద్దు పోకడలు నచ్చక పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఆయన విజయసాయిరెడ్డి కి అండగా నిలుస్తానని.. ఆయన ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. విజయసాయిరెడ్డి నవంబర్ 11న పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి దసరా పండుగ సమయంలో పార్టీ ఏర్పాటు చేయాలని భావించారు..కానీ స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా ఇతర కారణాల దృష్ట్యా నిర్ణయం మార్చుకున్నారు. ఈ నెలలోనే ఆయన కొత్త పార్టీ ప్రారంభించనున్నారు.విజయసాయిరెడ్డి గత నెలలో తిరుపతిలో తన పార్టీ గురించి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడారు. అనంతరం మరుసటి రోజు శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వేంకటేశ్వర స్వామిని విజయసాయి దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన ఆయన.. కొత్త పార్టీ విర్భావం, తనతో కలిసి పనిచేయబోయే వారి గురించి చెప్పుకొచ్చారు. కొత్త పార్టీకి స్వామి వారి ఆశీస్సులు పొందినట్లు తెలిపారు. అలాగే తన సహచుడు ఓవీ రమణను కొత్త పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. తాము గతంలో నాలుగేళ్ల పాటు టీటీడీ బోర్డు సభ్యులుగా కలిసి పని చేశామని విజయసాయిరెడ్డి గుర్తు చేసుకున్నారు. నూతన పార్టీలో ఇద్దరం కలిసి విజయం సాధిస్తామన్నారు. విజయసాయిరెడ్డి ఆహ్వానం మేరకు కొత్త పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు.తిరుపతికి చెందిన ఓవీ రమణ టీడీపీలో కీలక నేతగా ఎదిగారు. అయితే 2019లో ఆయన బీజేపీలో చేరారు.. 2020లో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే కారణంతో బీజేపీ ఆయనను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఆయన తిరిగి టీడీపీలో చేరి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన గతంలో టీటీడీ పాలకమండలి సభ్యుడిగా కూడా పనిచేశారు. తిరుమల లడ్డూ నాణ్యత, ఆలయాల రక్షణ వంటి పలు అంశాలపై ఓవీ రమణ మాట్లాడారు. అయితే ఆయన టీడీపీకి రాజీనామా చేసి విజయసాయిరెడ్డి కొత్త పార్టీలో చేరతాననడం ఆసక్తికరంగా మారింది.

మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

అనంతపురం అనంతపురం సాయిబాబా కాలేజీలో మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమయింది. 62 డివిజన్లకు.. 62 టేబుళ్లు ఏర్పాటు చేసారు. మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం 24 టేబుళ్లు ఏర్పాటు చేసారు. 25 ఓట్లు చొప్పున కట్టలు కట్టి... లెక్కించనున్నారు. జిల్లాలో తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం మునిసిపాలిటీలకు కౌంటింగ్ ఏర్పాట్లు జరిగాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుకొండ, మడకశిర, హిందూపురం పుట్టపర్తి ధర్మవరం, కదిరి మునిసిపాలిటీ లకు కౌంటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పోలీసులు కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసారు.

తెలంగాణ పొలిటికల్ గేమ్‌లో
జగన్ దారెటు



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిల మధ్య ఉన్న సాన్నిహిత్యం, ఆ రెండు పార్టీల మధ్య ఉన్న సత్సంబంధాలు అందరికీ తెలిసినవే. గడిచిన కొన్నేళ్లుగా ఒకరికొకరు నైతిక మద్దతు ఇచ్చుకుంటూ వచ్చారు. కానీ, మారిన తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో భాగంగా కేటీఆర్ తీసుకుంటున్న కొత్త రాజకీయ వ్యూహం ఇప్పుడు పొరుగు రాష్ట్రంలో ఉన్న తన ఆప్తమిత్రుడు జగన్‌మోహన్ రెడ్డిని ఇరకాటంలో పడేస్తోంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడానికి కేటీఆర్ పదే పదే ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు నాయుడు సర్కార్ పాలనను, అక్కడ జరుగుతున్న వాటర్ మేనేజ్‌మెంట్‌ని ప్రశంసించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో.. మా తెలంగాణలోనే సంక్షేమం, అభివృద్ధి వేగంగా సాగుతున్నాయి, పొరుగున ఉన్న ఏపీలో విద్యుత్ కోతలు, దారుణమైన రోడ్లు ఉన్నాయి అంటూ కేటీఆర్, ఇతర గులాబీ నేతలు పరోక్షంగా విమర్శించేవారు. అప్పుడు ఏపీలో సీఎంగా ఉన్నది తన మిత్రుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అయినప్పటికీ, తెలంగాణ మోడల్‌ను గొప్పగా చాటుకోవడానికే కేటీఆర్ ఏపీని తక్కువ చేసి మాట్లాడారు. ఇక ఇప్పుడు సీన్ తలకిందులైంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం పీఠం ఎక్కడంతో.. రేవంత్ రెడ్డి నమూనా ఎంత దారుణంగా ఉందో చూపించే క్రమంలో చూడండి, పక్క రాష్ట్రమైన ఏపీలోనూ ఎల్‌నినో ఉంది, కానీ అక్కడ చంద్రబాబు ప్రభుత్వం పరిస్థితులను ఎంత పక్కాగా మేనేజ్ చేస్తోంది! అంటూ చంద్రబాబు వైపు కితాబుల వర్షం కురిపిస్తున్నారు.ఈ వ్యూహంలో కేటీఆర్‌కు ఎలాంటి స్వార్థ రాజకీయ స్వార్థం లేకపోవచ్చు. కేవలం తెలంగాణ కాంగ్రెస్‌పై దాడి చేయడమే ప్రధాన ఉద్దేశం కావచ్చు. కానీ, కేటీఆర్ నోటి వెంట వస్తున్న ఈ మాటలు నేరుగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ రాజకీయ మనుగడకు, ప్రతిపక్ష పోరాటానికి పెను శరాఘాతంగా మారుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, కరవును ఎదుర్కోవడంలో చంద్రబాబు చేతులెత్తేశారని వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేస్తుంటే.. తెలంగాణ నుంచి జగన్ మిత్రుడే అయిన కేటీఆర్ వచ్చి ఆంధ్రాలో చంద్రబాబు పాలన, వాటర్ మేనేజ్‌మెంట్ బాగుంది అని సర్టిఫికేట్లు ఇవ్వడం వైసీపీ ప్రచారానికి పూర్తిగా గొడ్డలిపెట్టులా మారుతోంది. టీడీపీ నేతలు, మద్దతుదారులు కేటీఆర్ కామెంట్లను ఆయుధంగా మలుచుకుని నెట్టింట విరుచుకుపడుతున్నారు. జగన్ సన్నిహితుడైన కేటీఆర్ కూడా కూటమి ప్రభుత్వ పాలనను మెచ్చుకుంటున్నారు, ఇక జగన్ చెప్పే కల్పిత విమర్శలను ఎవరు నమ్ముతారు? అంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. దీంతో ఏపీలో వైసీపీ నేతలు ప్రతిసారీ కేటీఆర్ వ్యాఖ్యలకు సమర్థన ఇచ్చుకోలేక, అలాగని మిత్రుడిని విమర్శించలేక తీవ్ర మానసిక మథనానికి గురవుతున్నారు. జగన్‌ను కన్ఫ్యూజన్‌లో పడేస్తున్న ఈ కామెంట్లు వైఎస్సార్‌సీపీ క్యాడర్‌కు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి.రాజకీయంలో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు అనే నానుడితో పాటు సొంత ఇంటి సంక్షోభం ముందర పొరుగువారి స్నేహం ద్వితీయమే అనే సూత్రం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్‌కు ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డిని దెబ్బతీయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మళ్లీ బలమైన పునాదిపై నిలబెట్టడం మాత్రమే ఏకైక ప్రాధాన్యత. అందుకోసం వైరి వర్గమైన చంద్రబాబునైనా సరే మెచ్చుకోవడానికి ఆయన వెనుకాడటం లేదు. ఈ క్రమంలో తన మిత్రుడు జగన్‌కు రాజకీయంగా ఎంత నష్టం జరుగుతోందనే అంశాన్ని కేటీఆర్ పూర్తిగా పక్కన పెట్టేసినట్లే కనిపిస్తోంది. తమ సొంత ప్రయోజనాలు, రాజకీయ వ్యూహాల కోసమే కేటీఆర్ ఆంధ్రాను వాడుకుంటుండటంతో, స్నేహానికి-రాజకీయ అవసరాలకు మధ్య ఉన్న స్పష్టమైన సరిహద్దులు బయటపడ్డాయి. మిత్రుడి ఇబ్బందులను పక్కనపెట్టి కేటీఆర్ సాగిస్తున్న ఈ సెల్ఫ్-పొలిటికల్ గేమ్ రాబోయే రోజుల్లో జగన్-కేటీఆర్‌ల చెలిమిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో, ఏపీ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ దీనికి ఎలా కౌంటర్ ఇస్తుందో వేచి చూడాలి.

నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు

- సీఐ ప్రకాష్ కుమార్

- కౌతాళం మండలంలో ఎన్నికల ప్రశాంతతకు పోలీసుల చర్యలు

కౌతాళం కౌతాళం మండలంలో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కౌతాళం సీఐ జి. ప్రకాష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రామయ్య పలు గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కౌతాళం మండల ప్రజలు, ఓటర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.ఓటరు ఏ గ్రామంలో ఓటు హక్కు కలిగి ఉంటారో అదే గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇతర గ్రామాలకు వెళ్లి ఓట్లు వేయడానికి ప్రయత్నించరాదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అనవసరంగా ఇతర గ్రామాల్లో గుమిగూడడం, గొడవలకు పాల్పడడం, దొంగ ఓట్లు వేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అదేవిధంగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే వీడియోలు, వివాదాలకు దారితీసే పోస్టులు, వాక్యాలు లేదా వార్తలు ప్రచారం చేయరాదని హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామాల్లో ఎవరూ అక్రమంగా మద్యం నిల్వ ఉంచరాదని, అక్రమ మద్యం కలిగి ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపే చర్యలు చేపడతామని హెచ్చరించారు.ఈ నెల 5వ తేదీ గురువారం జరగనున్న ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీఐ ప్రకాష్ కుమార్ కోరారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా,ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు,అభ్యర్థులు,రాజకీయ పార్టీల నాయకులు పోలీసుల సూచనలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు...

ప్రధాన పార్టీలకు దీటుగా ఇండిపెండెంట్ అభ్యర్థి మాల మాలతి ప్రచారం

- ఒక అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- ఎంపీటీసీ అభ్యర్థి మాల మాలతి



సి. బెళగల్,సి. బెళగల్ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేడెక్కుతోంది. సి. బెళగల్ ఒకట వ నంబర్ ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాల మాలతి ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు దీటుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం, జనసేన, వైఎస్సార్‌సీపీ వంటి ప్రధాన పార్టీల అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తూ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుస్తున్నారు.ఎలాంటి రాజకీయ పార్టీ అండదండలు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన మాల మాలతి ప్రచారంలో దూసుకుపోతుండటంతో స్థానికంగా ఆమె పోటీపై ఆసక్తి నెలకొంది. ప్రధాన పార్టీలకు ధీటుగా ఆమె ప్రచారం సాగుతుండటంతో ఓటర్లు సైతం ఆమె వైపు మొగ్గు చూపుతున్నారని గ్రామ ప్రజల్లో చర్చ జరుగుతోంది.ఈ సందర్భంగా మాల మాలతి మాట్లాడుతూ.. తనకు ఒక అవకాశం కల్పించి ఎంపీటీసీగా గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. పదవిని ప్రజాసేవకు వేదికగా మార్చుకుని గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు.మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం పంపిణీకి పాల్పడుతున్నాయని ఆమె విమర్శించారు. ఓటుకు నోటు, మద్యం పంపిణీ వంటి ప్రలోభాలతో ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడం సరికాదని దుయ్యబట్టారు. ఓటర్లు డబ్బు, మద్యానికి లొంగకుండా తమ గ్రామ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా ప్రజల మద్దతుతో ఎన్నికల బరిలో ముందుకు సాగుతానని మాల మాలతి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులు, ఆదరణ తనకు అండగా ఉన్నాయని, ఈ ఎన్నికల్లో గ్యాస్ సిలిండర్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించి తనకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరుతున్నారు.

నవ్వుతు తీసుకుంటాం,నయా పని చేయ్యాం

గతంలో మూటలు మోసిన సిఎం,మాటలు మార్చిన సర్కార్

బోయిన్ పల్లి మార్కెట్ లో హమాలీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న కార్మికులు

పదుల సంఖ్యలో వినతి పత్రాలు,పట్టించుకొని మార్కెటింగ్ అధికారులు,

నిన్న జాయింట్ డైరెక్టర్ కు వినతి పత్రం అందజేసిన యూనియన్ నాయకులు

ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్,సమస్యల్లో కూడా ముందు వరుసలో ఉంది

ఖజానా మాకు,కష్టాలు మీకు.నెలకొసారి ఆసుపత్రికి

నయ్యం కాని రోగాలతో రెగ్యులర్ ఫైట్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) 2019 సార్వత్రిక ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా నామినేషన్ వేసిన రేవంత్ రెడ్డి.ఎన్నికల ప్రచారంలో భాగంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో కార్మికులతో భేటీ అయ్యారు, అది గాకుండా మీ కష్టాలు పోవాలంటే కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ గా నామినేషన్ దాఖలు చేసిన నాకు ఓటు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని ఆయన కోరడం జరిగిందని అలాగే బోయిన్ పల్లి మార్కెట్ లో ఇద్దరి హమాలీ కార్మికుల పిల్లలకు "కేంద్రీయ విద్యాలయంలో"అడ్మిషన్ ఇచ్చింది ఎంత నిజమో, త్వరలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది మార్కెట్ రూపురేఖలు మారుతాయని "మూటలు మోస్తూ హామీలు ఇచ్చిన ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి అని మార్కెట్ కార్మిక లోకం గళమెత్తుతోంది.అలాగే మార్కెట్ లో కొంత కాలంగా మౌళిక సమస్యలు తిష్ట వేశాయి.ఎంతకి పరిష్కారం కాకపోవడంతో కొన్ని నెలలక్రితం నేతలు,కమీషన్ ఏజెంట్లు సైతం ధర్న చేసిన విషయం విదితమే. అయిన్నప్పటికి మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారుల్లో చలనం లేకపోవడం వల్ల పలు రకాల రుగ్మతులకు గురౌతున్నమార్కెట్ యార్డులో వర్తకులు, హామాలీలు,ఖరీదుదారులు. ఈ మధ్య కాలంలో జాయింట్ డైరెక్టర్ అధికారి మల్లేశం పదుల సార్లు బోయిన్ పల్లి మార్కెట్ కి వస్తున్నప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం శోచనీయం.

హమాలీ యూనియన్ నాయకులు జెడికి వినతి పత్రం..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో హమాలీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రతి రెండు సంవత్సరాలకు పెంచవలసిన హమాలీ రేట్లు పెంచాలని పలు మార్లు కోరుతున్న ఇప్పటి వరకు పెంచడం లేదని, మార్కెట్లో కనీస సౌకర్యాలు హమాలీలకు లేకపోవడం.వాటిల్లో కొన్ని ముఖ్యమైనవి: యూనిఫారం ప్రాధమిక వైద్య సదుపాయాలు, మంచినీటి, మరుగుదొడ్ల సౌకర్యం లేకుండా ఉన్నారని తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలని నిన్న బోయిన్ పల్లి మార్కెట్ కు విజిటింగ్ కు వచ్చిన వ్యవసాయ మార్కెట్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం ను యూనియన్ ఆధ్వర్యంలో కలసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ మాట్లాడుతూ హమాలిరెట్లా పెంపుదలకే సెప్టెంబర్ 17వ తేదీన లెటర్ ఇచ్చిన ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమని వారు వివరించారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలని, హమాలీలకు రావలసిన యూనిఫారం దాదాపు సంవత్సర కాలంగా పెండింగ్లో ఉన్నదని వారు జాయిన్ డైరెక్టర్ కు వివరించడం జరిగింది. బోయిన్ పల్లి మార్కెట్లో మంచినీటి ట్యాంకులు రిపేర్ లో ఉన్నాయని దోమల బెడద అధికంగా ఉన్నదని మరుగుదొడ్ల సౌకర్యం,ప్రధమ చికిత్స ఆసుపత్రి లాంటి మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఉన్నదని వారు ఆవేదన వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా వినతిపత్రం తీసుకున్న మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్,మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు వైస్ చైర్మన్ డిబి దేవేందర్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం.వెంకన్న, యార్డ్ ఇన్చార్జ్ మధులిక స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కార్మికుల సమస్యలను తక్షణ పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని యూనియన్ ప్రతినిధులకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఏ గట్టయ్య, ఉపాధ్యక్షులు సమ్మయ్య,రాజు,రాజయ్య, లింగం,శ్రీశైలం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన ఢిల్లీలో గళం

-శ్రీనివాసరావు పోరాటానికి ఫలితం

-ఎరువుల యాప్‌లో భూవిస్తీర్ణ లెక్కల్లో లోపానికి చెక్

-గుంటలను సెంట్లుగా లెక్కించడంలో జరిగిన తప్పిదం సవరణ

- కేంద్ర వ్యవసాయ, ఎరువుల శాఖల ఆదేశాలతో యాప్‌లో డేటా మార్పులు

- తెలంగాణ రైతులకు ఇకపై భూవిస్తీర్ణానికి అనుగుణంగా ఎరువుల కోటా



వరంగల్ బ్యూరో (ప్రశ్న న్యూస్)రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి, ఆధారాలతో కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించిన అభ్యుదయ రైతు మట్టపల్లి శ్రీనివాసరావు పోరాటం ఫలించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లికి చెందిన శ్రీనివాసరావు ఎరువుల విక్రయ యాప్‌లో భూవిస్తీర్ణం నమోదు విషయంలో జరుగుతున్న సాంకేతిక లోపాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సమర్పించిన ఆధారాలను పరిశీలించిన సంబంధిత శాఖలు స్పందించి యాప్‌లో డేటా సవరణ చేపట్టాయి. దీంతో తెలంగాణ రైతులకు భూవిస్తీర్ణానికి అనుగుణంగా ఎరువుల కోటా పొందే అవకాశం కలగనుంది.

గుంటలను సెంట్లుగా లెక్కించడంలో తప్పిదం

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్‌ను వినియోగిస్తోంది. అయితే తెలంగాణ రెవెన్యూ రికార్డుల్లో భూమిని గుంటల ప్రాతిపదికన నమోదు చేస్తుండగా, యాప్‌లో గుంటలను సెంట్లుగా పరిగణించే విధానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. వాస్తవానికి ఒక ఎకరానికి 40 గుంటలు, 100 సెంట్లు ఉంటాయి. అంటే ఒక గుంట 2.5 సెంట్లకు సమానం. కానీ యాప్‌లో ఒక గుంటను ఒక సెంటుగా లెక్కించడం వల్ల రైతుల భూమి విస్తీర్ణం తక్కువగా నమోదవుతూ వచ్చింది. ఉదాహరణకు ఒక రైతుకు ఎకరం 20 గుంటల భూమి ఉంటే వాస్తవానికి అది 150 సెంట్లు. కానీ యాప్‌లో 120 సెంట్లుగానే చూపించడంతో 30 సెంట్ల భూమి తక్కువగా నమోదవుతోంది. ఈ కారణంగా రైతులకు అందాల్సిన ఎరువుల కోటాలో కోత పడే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని శ్రీనివాసరావు గుర్తించారు.

ఢిల్లీ స్థాయిలో అధికారుల దృష్టికి సమస్య..

ఈ సమస్యను కేవలం వ్యక్తిగత ఇబ్బందిగా చూడకుండా రాష్ట్ర రైతులందరికీ సంబంధించిన అంశంగా భావించిన శ్రీనివాసరావు భూ రికార్డులు, యాప్‌లో నమోదైన వివరాలను పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించారు. అక్టోబర్ మొదటి వారంలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ, కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖతో పాటు రాష్ట్ర వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు వినతిపత్రాలు సమర్పించారు.

దీనిపై స్పందించిన కేంద్ర ఎరువుల శాఖ సమస్యను డీబీటీ విభాగం, ఎఫ్ఎఫ్ఎస్ సాంకేతిక బృందం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. తెలంగాణ రెవెన్యూ, వ్యవసాయ శాఖలతో సమన్వయం చేసుకుని భూమి కొలతలకు అనుగుణంగా యాప్‌లో మార్పులు చేయాలని సూచించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సైతం రైతుల భూవిస్తీర్ణం రెవెన్యూ రికార్డులకు అనుగుణంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో యాప్‌లో గుంటలు, సెంట్ల లెక్కలకు సంబంధించిన డేటా సవరణ పూర్తయింది.

రైతులకు ఇకపై ప్రయోజనం

ఈ మార్పులతో తెలంగాణలో గుంటల ప్రాతిపదికన భూమి కలిగిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూవిస్తీర్ణం, ఎరువుల యాప్‌లో నమోదయ్యే వివరాల మధ్య వ్యత్యాసం తగ్గనుంది. భూమి విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువుల కోటా పొందేందుకు మార్గం సుగమం కానుంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు జరుగుతున్న అన్యాయానికి పరిష్కారం లభించినట్లయింది.

రైతు సమస్యపై పోరాటానికి అభినందనలు

తనకు ఎదురైన సమస్యను గుర్తించి, దాని వెనుక ఉన్న సాంకేతిక లోపాన్ని విశ్లేషించి, ప్రభుత్వ శాఖలతో నిరంతరం సంప్రదింపులు జరిపి పరిష్కారం సాధించడం పట్ల శ్రీనివాసరావుపై రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ నిపుణులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక రైతు పట్టుదలతో పోరాడితే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రైతులకు మేలు జరుగుతుందని ఆయన నిరూపించారని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైతుల హక్కుల కోసం ఆధారాలతో ఢిల్లీ స్థాయిలో గళమెత్తి సమస్య పరిష్కారానికి కృషి చేసిన మట్టపల్లి శ్రీనివాసరావుకు రైతు లోకం అభినందనలు తెలియజేస్తోంది.

మురసుతో నీటి కష్టాలకు చెక్

గుంటూరు : మురసు తుఫానుతో రాష్ట్రంలో రాయలసీమ, పల్నాడు జిల్లాలలో నీటి లోటు తీరే పరిస్థితి కనిపిస్తోంది. నెల్లూరు సమీపంలో తీరందాటనున్న మురసు కారణంగా దక్షిణకోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉండగా, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలను తట్టుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక తుఫాను హెచ్చరికలు, భారీ వరదలపై అంచనాలతో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం నుంచి సెక్రటేరియట్ లో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో తిష్ట వేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలు జారీ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. అర్నాబ్ కంటే తక్కువ ప్రభావం కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు తెలిపారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని వివరించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు.

ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు.

ఏపీలో రేషన్ పంపిణీపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

అమరావతి ఏపీలో రేషన్ పంపిణీపై అధికారుల కీలక ప్రకటనఎవరికీ రేషన్ పంపిణీ నిలిపివేయలేదని స్పష్టతఒకవేళ రేషన్ నిలిపివేస్తే సమాచారం ఇవ్వాలన్నారుఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కు సంబంధించి పౌరసరఫరాల శాఖ అధికారులు కీలక ప్రకటన చేశారు.. అసలు రేషన్ నిలిపివేయాలని ఎలాంటి ఆదేశాలివ్వలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొంత మంది రేషన్‌కార్డుకు మొబైల్ నంబరు అనుసంధానం చేయలేదని, కుటుంబ సభ్యుల ఈకేవైసీ పూర్తి కాలేదనే కారణాలుగా చెప్పి రేషన్ సరుకులు నిలిపివేసేలా ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదన్నారు. కొందరు డీలర్లు రేషన్ కార్డుకు మొబైల్ నంబర్ లింక్ కాలేదని.. కుటుంబసభ్యుల ఈకేవైసీ పూర్తి కాలేదని సరుకులు నిలిపివేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు రేషన్‌కార్డులకు మొబైల్ నంబర్ల అనుసంధానం చేయని కుటుంబసభ్యుల నంబర్లను మాత్రమే సేకరించాలని ఆదేశాలిచ్చినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. మొబైల్ నంబరు లింక్ చేయడం, కుటుంబసభ్యుల ఈకేవైసీ పూర్తి చేయకపోయినా ఏ ఒక్క కార్డుదారునికి రేషన్ నిరాకరించేది లేదన్నారు. ఒకవేళ ఇలాంటి ఘటనలు జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. రేషన్ సరుకులు ఎవరికి నిలిపివేయడం లేదన్నారు.ప్రధానంగా బీపీటీ స్టీమ్ రకం బియ్యాన్ని కిలో రూ.66 చొప్పున.. సాధారణ స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.47కు మించకుండా విక్రయించేందుకు రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ అసోసియేషన్ ప్రతినిధులు అంగీకారం తెలిపినట్లు వివరించారు. అంతేకాదు ఉల్లి ధరల్ని నియంత్రించాలని.. కిలో రూ.35 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. 80 టన్నుల ఉల్లిని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని.. నిత్యావసర వస్తువల ధరల నియంత్రణ చర్యలతో ప్రభుత్వంపై నెలకు రూ.100 కోట్ల భారం పడుతుందని చెప్పారు అధికారులు.

ఏపీకి అండగా నిలిచిన కర్ణాటక

అమరావతి తుఫానుతో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్‌కు కర్ణాటక ప్రభుత్వం అండగా నిలిచింది. అర్నబ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడంలో సహాయ పడేందుకు ఆ ప్రభుత్వం ముందుకు వచ్చింది. తుఫాన్ ధాటికి చాలా ప్రాంతాల్లో 15 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఏపీ కర్ణాటక సహాయాన్ని కోరడం జరిగింది. దీనికి ఆ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.ఈ తరుణంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. ఇలాంటి సమయంలో తమ ప్రభుత్వం ఏపీకి అన్నిరకాలుగా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. అంతేకాదు 'విద్యుత్ అత్యవసర సేవ.. బాధితుల కోసం కరెంట్ సేవలను వెంటనే పునరుద్ధరించడం చాలా ముఖ్యం' అని డీకే శివకుమార్ అన్నారు. అలాగే తుఫాన్ అనంతర పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్రం తరపున పూర్తి మద్దతు ఉంటుందని నాయుడికి డీకే హామీ ఇచ్చారు.ఇక, ఏపీకి సహాయక చర్యలు అందించడం కోసం ఆ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కేజే జార్జ్ రంగంలోకి దిగారు. ఈయన పర్యవేక్షణలోనే సహాయక చర్యలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా 500 మంది నైపుణ్యం కలిగిన పవర్ మెన్లు, క్రేన్లు, గుంతలు తవ్వే మెషిన్లతో కూడిన 15 పాల్‌ఫింగర్ ట్రక్కులు, 25 ట్రాక్టర్ మౌంటెడ్ డ్రిల్లింగ్ యంత్రాలను ఆంధ్రప్రదేశ్‌కు పంపించారు. ఈ బృందాలు సోమవారం మధ్యాహ్నం బయల్దేరి రాష్ట్రానికి చేరుకున్నాయి. ఇదే సందర్భంలో మురసు తుఫాన్ ప్రభావాన్ని కూడా కర్ణాటక ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని సీఎం శివకుమార్ పేర్కొన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైతే మరిన్ని సహాయక చర్యలు అందిస్తామని ఆయన వెల్లడించారు.అర్నబ్ కారణంగా ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో ఏపీకి సహాయం అందించేందుకు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు కూడా ముందుకు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ సిబ్బందితో పాటుగా అవసరమైన పరికరాలను ఆంధ్రప్రదేశ్‌కు పంపించింది. అలాగే తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రికి ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫోన్ చేసి.. విద్యుత్ సిబ్బందిని, సామాగ్రిని రాష్ట్రానికి పంపించాల్సిందిగా కోరారు. ఏపీ మంత్రి విజ్ఞప్తికి తమిళనాడు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

ఎవరెస్ట్ బేస్ క్యాంప్ సమీపంలో

రెండు హెలికాప్టర్లు ఢీ

నేపాల్‌లోని పెరిచే వద్ద ల్యాండ్ అయ్యే ప్రయత్నంలో ఫిష్‌టెయిల్ ఎయిర్, ఎయిర్ డైనాస్టీకి చెందిన రెండు హెలికాప్టర్లు పరస్పరం ఢీకొన్నాయి. ఉదయం 8:15 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో భారతీయుడు వసంత్ కుమార్ మృతి చెందగా, ఇద్దరు పైలట్లు సహా మరో వ్యక్తి శైలేష్ కృష్ణ పటేల్ గాయపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

సంగారెడ్డి కంది మండలం కాశింపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్ మధ్యలో ఉన్న కరెంటు పోల్‌ను కారు ఢీకొని పల్టీలు కొట్టినంది.

ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గాజులగూడకు చెందిన నర్సింలు (40), అతని భార్య మౌనిక (30) మృతి చెందారు. మృతులకు ఇద్దరు కుమారులు ఉన్నట్టు, సంగారెడ్డి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు సమయాచారం. సీసీ కెమెరాల్లో ప్రమాద దృశ్యాలు రికార్డయ్యాయి.

నిర్మల్ బయలుదేరిన బీజేపీ నేతలు

హైదరాబాద్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇంచార్జీ (ప్రభారి) సునీల్ బన్సల్ , బీజేపీ తెలంగాణ సహ-ఇంచార్జీ (సహ ప్రభారి)లు అభయ్ పాటిల్ (బెలగావి దక్షిణ్ ఎమ్మెల్యే, కర్ణాటక), రేఖా శర్మ (రాజ్యసభ సభ్యురాలు), మరియు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మంగళవారం బేగంపేట విమానాశ్రయం నుండి హెలికాప్టర్ ద్వారా నిర్మల్ కు బయలుదేరారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి రి నాయకత్వంలో నిర్మల్ లో జరగబోయే పాదయాత్రలో పాల్గొంటున్నారు.

భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం

- అసైన్డ్, ఇనాం, చుక్కల భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తులపై కీలక జీవో.

అమరావతి రాష్ట్రంలోని అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఈ భూముల ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా.. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన డెడ్‌లైన్లు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 659ను అధికారికంగా రిలీజ్ చేసింది.ఈ కొత్త జీవో ప్రకారం ఆర్డీవో (ఖీఆూ) పరిధిలోకి వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను ఎక్కువలో ఎక్కువగా రెండు నెలల్లోపు అంటే 60 రోజుల్లోపు కచ్చితంగా పరిష్కరించాల్సి ఉంటుంది.

అదేవిధంగా కొన్ని నిర్దిష్ట కేటగిరీలకు చెందిన అప్లికేషన్లను కేవలం నెల రోజుల్లోనే క్లియర్ చేయాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన గడువును నిర్దేశించింది. ఇక తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులకు సైతం 60 రోజుల సమయాన్ని గరిష్ట పరిమితిగా నిర్ణయించింది.ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం రెవెన్యూ శాఖ పోర్టల్లో పలు సాంకేతిక మార్పులను సైతం చేసింది. రైతులు లేదా యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే, ఆ అప్లికేషన్ నేరుగా సంబంధిత తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. దీనివల్ల ఫైళ్ల కదలికలో జరిగే జాప్యానికి పూర్తిగా చెక్ పడినట్లవుతుంది.అలాగే రిజిస్ట్రేషన్ల విషయంలోనూ ప్రభుత్వం రైతులకు లైన్ క్లియర్ చేసింది. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్‌గా నమోదైన వెంటనే, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని పేర్కొంది. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రత్యేకంగా అధికారుల నుంచి ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్‌ని అందించాల్సిన అవసరం ఇకపై ఉండదని వెల్లడించింది. వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేట్ అయిన వివరాలను రికార్డుల్లో పకడ్బందీగా భద్రపరచాలని, ఈ సరికొత్త గైడ్‌లైన్స్‌ను రెవెన్యూ యంత్రాంగం తప్పకుండా పాటించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కొత్త మార్గదర్శకాల వల్ల భూ వివాదాలకు తెర పడే అవకాశం ఉంది. అలాగే రెవెన్యూ సేవలు మరింత వేగవంతం కానున్నాయి.

'అక్క' (నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!



కీర్తి సురేశ్ ఎప్పటికప్పుడు విభిన్నమైన .. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు వెళుతోంది. నటన ప్రధానమైన పాత్రలను చేయడానికి ఆసక్తిని కనబరచడం ఆమె కెరియర్ తొలినాళ్ల నుంచి కనిపిస్తుంది. ఇక రాధికా ఆప్టే కూడా వైవిధ్యభరితమైన పాత్రలను చేయడానికి ఎంతమాత్రం వెనుకాడదు. అలాంటి ఈ ఇద్దరూ కలిసి నటించిన సిరీస్ గా 'అక్క' కనిపిస్తుంది. అక్టోబర్ 30వ తేదీ నుంచి 5 ఎపిసోడ్స్ గా ఈ సిరీస్ 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగులోను అందుబాటులో ఉంది. శతాబ్దాల క్రితం 'పెర్నూర్' రాజు తన సైన్యంతో కలిసి యుద్ధానికి వెళతాడు. కానీ వాళ్లెవరూ తిరిగిరారు. దాంతో శత్రువులు ఆ రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నాలు మొదలుపెడతారు. రాజ్య రక్షణ కోసం ఆ రాజు చెల్లెళ్లయిన ముత్తక్క .. దుగ్గమ్మ .. సుబ్బమ్మ రంగంలోకి దిగుతారు. మహిళలందరికీ యుద్ధ విద్యలతో పాటు, వ్యవసాయం .. వ్యాపారానికి సంబంధించిన మెళకువలు నేర్పిస్తారు. రాజ్యంలో మాతృస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. 'పెర్నూరు' ప్రాంతానికి చెందిన ప్రజలంతా 'రక్తూర్తిదేవి' అమ్మవారిని కులదేవతగా కొలుస్తుంటారు. ఈ రాజ్యంలోని నిబంధనల ప్రకారం, సింహాసనాన్ని అధిష్ఠించే అవకాశం ఉన్న స్త్రీలు వివాహం చేసుకోరు. ఆ వంశానికి చెందిన ఆడపిల్లలకు మాత్రమే సింహాసనం దక్కుతుంది. వారసుల కోసమే పిల్లలను కంటారు. సింహాసనం అధిష్ఠించిన స్త్రీని అంతా 'అక్క' అని పిలుస్తారు. తన రాజ్యం కోసం .. తన ప్రజల కోసం ఆమె ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటుంది. ముత్తక్క - దుగ్గమ్మ - సుబ్బమ్మ ఈ ముగ్గురూ కూడా తమ రాజ్యాన్ని మలేమార్ .. హెర్కడా .. పెర్వలాడి అనే భాగాలుగా విభజిస్తారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వం ఈ ప్రాంతాలను విలీనం చేసుకుంటుంది. అయినా ఆ ప్రాంతంపై 'అక్క'ల ఆధిపత్యం కొనసాగుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలోనే 'ముంబై'లో మాఫియా డాన్ గా ఉన్న శంకరన్న కన్ను పడుతుంది. గతంలో పెర్నూర్ నుంచి పారిపోయి వచ్చిన వ్యక్తి అతను. 'పెర్నూర్'లో అక్కల ఆధిపత్యానికి తాను కళ్లెం వేస్తానని చెప్పి అక్కడికి చేరుకుంటుంది 'రుద్ర'(రాధికా ఆప్టే).రుద్ర తాను అనుకున్నది సాధించడం కోసం, 'అక్క'లకి వ్యతిరేకంగా ఉన్న వర్గాన్ని తన వైపుకు తిప్పుకోవడం మొదలుపెడుతుంది. అలాగే అక్కడి ప్రజలను ఆకర్షించడం .. అక్కల వ్యాపారాలను దెబ్బతీయడం మొదలుపెడుతుంది.ఈ నేపథ్యంలోనే 'కావేరి' అనే పాపను వారసురాలిగా ప్రకటించిన కొన్ని రోజులకే రుద్ర హత్య చేయిస్తుంది. అలాగే ఓ పథకం ప్రకారం ముత్తక్కను చంపిస్తుంది. అప్పుడు భవాని (కీర్తియు సురేశ్) అక్కగా సింహాసనాన్ని అధిష్ఠిస్తుంది.అసలు 'రుద్ర' ఎవరు? ఎందుకు ఆమె అక్కల పట్ల ప్రతీకారంతో రగిలిపోతుంది? భవానిని ఎదుర్కోవడానికి ఆమె ఏం చేస్తుంది? ఆమె పన్నాగాలను తిప్పికొట్టడం కోసం భవాని ఏం చేస్తుంది? అసలు ముంబైలో ఉన్న శంకర్ భాయ్ కీ .. భవానికి ఉన్న సంబంధం ఏమిటి? తనవారిని కాపాడుకోవడం కోసం భవాని ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది మిగతా కథ.1947 - 1985 మధ్య కాలంలో జరిగే కథ ఇది. 'అక్క' అంటే కేవలం ఒక వరస మాత్రమే కాదు .. తనని తాను త్యాగం చేసుకునే పెద్ద దిక్కు'. అనే ఒక డైలాగ్ ఈ సిరీస్ లో ప్రధానమైన పాత్రను పోషించిన కీర్తి సురేశ్ చెబుతుంది. అదే ఈ సిరీస్ కాన్సెప్ట్ కూడా. 'అక్క' అంటే ఒక నాయకురాలు. తనవారిని కాపాడుకునే సంరక్షకురాలు .. అదే విషయాన్ని చాటుతూ వెళ్లే కథనే ఇది. ఒక రాజ్యం .. అక్కడి పాలకులు .. ప్రజలు .. ఆచార సంప్రదాయాలు .. జీవన విధానం .. ఈ కథలో చోటుచేసుకుంటాయి. 'అక్క' స్థానంలో సింహాసనాన్ని అధిష్ఠించినవారికి అపజయమనేది ఉండదు. వాళ్లతో తలపడిన శత్రువులెవరూ పారిపోకుండా నిలవలేకపోయారనే అంశం చుట్టూ ఈ కథ ఆసక్తికరంగా కొనసాగుతూ ఉంటుంది. వాళ్ల మాదిరిగా ఆలోచించే స్త్రీ శత్రువుగా మారితే ఎలా ఉంటుందో చూపిస్తానంటూ 'రుద్ర' రంగంలోకి దిగడంతో కథ పుంజుకుంటుంది. 'అక్క'ను దెబ్బ తీయడానికి 'రుద్ర' చేసే సన్నాహాలు, ఆమెను ఎదుర్కోవడానికి 'అక్క' వేసే పథకాలు ఆడియన్స్ లో ఉత్కంఠను రేకెత్తిస్తూ వెళతాయి. గతాన్ని మనసులో పెట్టుకుని 'రుద్ర' చేసే దుర్మార్గాలు .. తన రాజ్యంలోని వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రుద్రను కట్టడి చేయడానికి 'భవాని' తీసుకునే నిర్ణయాలు ఆడియన్స్ ను అలా కూర్చోబెడతాయి. ఈ ఇద్దరి మధ్య సన్నివేశాలు ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ దిశగా పరిగెత్తిన తీరు మెప్పిస్తుంది.కథ .. స్క్రీన్ ప్లే .. ఆయా పాత్రలకు నటీనటులను ఎంపిక చేసిన తీరు బాగుంది. ఇక 1947 .. 1985 మధ్య కాలం నాటి వాతావరణాన్ని క్రియేట్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది. ఆ కాలం నాటి కాస్ట్యూమ్స్ విషయంలో తీసుకున్న శ్రద్ధ మంచి మార్కులు దక్కేలా చేస్తుంది. ఎమోషన్స్ తో పాటు యాక్షన్ సన్నివేశాలను డిజైన్ చేసిన విధానం కూడా ఆకట్టుకుంటుంది. అయితే సీక్వెల్ కోసం అన్నట్టుగా ఈ సీజన్ ను ముగించిన విధానం అసంతృప్తిని కలిగిస్తుంది. కీర్తి సురేశ్ తో పాటు మిగతా ఆర్టిస్టులంతా చాలా బాగా చేశారు. ఆ కాలం నాటి కథను .. కథగా కాకుండా నిజమేనని అనుకునేలా చాలా సహజంగా చేశారు. ప్రధానమైన పాత్రలను పోషించిన కీర్తి సురేశ్ .. రాధికా ఆప్టే నటన ఈ సిరీస్ కి హైలైట్ గా నిలుస్తుంది. ఆ కాలం నాటి లైటింగ్ ఎఫెక్ట్ తో ఫొటోగ్రఫీ మెప్పిస్తుంది. ఎడిటింగ్ తో పాటు, జాన్ స్టీవర్ట్ నేపథ్య సంగీతం అలరిస్తుంది. 'అక్క' అంటే తనని తాను త్యాగం చేసుకునే ఒక పెద్ద దిక్కు అంటూ దర్శకుడు ఈ కథను ఎత్తుకున్న తీరు ఆకట్టుకుంటుంది. 1947- 85 మధ్య కాలంలోని కథను నడిపించే విధానం అలరిస్తుంది. కొత్త కాన్సెప్ట్ .. కొత్త కంటెంట్ కావడం వలన ప్రేక్షకులు ఏ మాత్రం బోర్ ఫీలవ్వకుండా ఫాలో అవుతారు. అక్కడక్కడా రక్తపాతంతో పాటు, అభ్యంతరకరమైన సన్నివేశాలు ఉండటం వలన .. సరైన వాతావరణంలోనే చూడవలసిన సిరీస్ ఇది.

ఈ నగరానికి ఏమైంది2' ట్రైలర్ విడుదల

నలుగురు స్నేహితుల సందడి ఈసారి మరింత గ్రాండ్‌గా!



టాలీవుడ్ యువత ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఈ నగరానికి ఏమైంది 2' ఒకటి. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా, తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా 2018లో విడుదలై ప్రేక్షకులను అలరించిన 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతోంది. మొదటి భాగానికి యువతలో ఉన్న క్రేజ్‌తో ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు ట్రైలర్ కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ట్రైలర్‌ను పరిశీలిస్తే.. మరోసారి నలుగురు స్నేహితుల జీవితాల్లో చోటుచేసుకునే సంఘటనలే కథకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు కనిపిస్తోంది. ఈసారి వాళ్లంతా కలిసి ఓ సినిమా చేయాలని ప్లాన్ చేసుకోవడం, ఆ ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలు, కొత్త వ్యక్తుల పరిచయాలు, అనుకోని పరిణామాలు కథలో ఆసక్తిని పెంచుతున్నాయి. వీటికి తోడు స్నేహితుల మధ్యే తలెత్తే గొడవలు, సరదా సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వించేలా ఉన్నాయి. మొదటి భాగంలో కనిపించిన స్నేహం, కామెడీ, యువత జీవితానికి దగ్గరగా ఉండే సంఘటనలను ఈసారి మరింత విస్తృతంగా చూపించినట్లు ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. ముఖ్యంగా కథలోని పరిస్థితులు, పాత్రల మధ్య సంబంధాలు మరింత లోతుగా ఉండబోతున్నాయనే భావన కలుగుతోంది. ఈ ట్రైలర్‌లో విజువల్ క్వాలిటీ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. మొదటి భాగంలో విశ్వక్ సేన్‌కు సంబంధించిన ఫాల్ సీక్వెన్స్ ప్రేక్షకులకు గుర్తుండిపోయింది. ఇప్పుడు రెండో భాగంలోనూ అలాంటి ఓ సన్నివేశాన్ని దర్శకుడు తరుణ్ భాస్కర్ మరింత భారీగా, ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందించినట్లు కనిపిస్తోంది. ట్రైలర్‌లోని కొన్ని దృశ్యాలు సినిమా నిర్మాణ విలువలను తెలియజేస్తున్నాయి. విశ్వక్ సేన్‌తో పాటు అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను, సాయిరామ్ తదితరులు తమ పాత్రల్లో మరోసారి సందడి చేయనున్నారు. శివాత్మిక రాజశేఖర్‌తో పాటు మరికొందరు నటులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. స్నేహితుల మధ్య కెమిస్ట్రీ, కామెడీ టైమింగ్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలిచే అవకాశముంది. మొదటి భాగానికి సంగీతంతో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన వివేక్ సాగర్ ఈ సీక్వెల్‌కు కూడా స్వరాలు అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఆయన నేపథ్య సంగీతం సన్నివేశాలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొస్తోంది. కథలోని సరదా, ఉద్వేగం రెండింటినీ సంగీతం ద్వారా చక్కగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. నవంబర్ 19న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.

'రామాయణ'కు పైరసీ భయం

- కీలక ఆదేశాలు జారీ చేసిన ముంబై హైకోర్టు!



భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం 'రామాయణ'. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రానికి నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమాను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన దృశ్యాలు, వీడియో క్లిప్పులు బయటకు రాకుండా నిర్మాతలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమాలకు పైరసీ పెద్ద సమస్యగా మారుతోంది. థియేటర్లలో విడుదలకు ముందే సినిమా దృశ్యాలు, పాటలు, కీలక సన్నివేశాలు సామాజిక మాధ్యమాల్లో లీక్ అయితే చిత్ర బృందానికి నష్టం కలిగే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను ముందుగానే అడ్డుకునేందుకు 'రామాయణ' నిర్మాతలు న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముంబై హైకోర్టు సినిమా పైరసీ, అనధికారిక వీడియో క్లిప్పుల ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేకంగా డైనమిక్ ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. సినిమా పేరుతో అనధికారికంగా లింకులు, వీడియోలు, క్లిప్పులు అప్‌లోడ్ చేసే వెబ్‌సైట్లు, ఇతర వేదికలపై చర్యలు తీసుకునేందుకు ఈ ఉత్తర్వులు ఉపయోగపడనున్నాయి. డిసెంబర్ మధ్య వరకు 'రామాయణ'కు సంబంధించిన పైరసీ లింకులు, అనధికారిక కంటెంట్ వ్యాప్తిని నియంత్రించేందుకు ఈ ఆదేశాలు తోడ్పడనున్నాయి. భారీ పెట్టుబడితో రూపొందుతున్న సినిమాను పైరసీ నుంచి రక్షించుకోవడంలో నిర్మాతలు తీసుకున్న ఈ చర్యకు ప్రాధాన్యత ఏర్పడింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ'లో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ యష్ రావణుడి పాత్ర పోషిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రముఖ నటులు ఒకే చిత్రంలో భాగం కావడంతో మొదటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్‌తో పాటు ప్రముఖ హాలీవుడ్ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. భారతీయ పురాణ గాథను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేసేలా భారీ సాంకేతిక హంగులతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, యష్ కూడా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు..

అల్లు అర్జున్ 'రాకా' షూటింగ్‌పై కీలక అప్‌డేట్.. దుబాయ్ షెడ్యూల్ హైదరాబాద్‌కు మార్పు!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'రాకా'పై పూర్తి దృష్టి పెట్టారు. ఇతర సినిమాలకి డేట్స్ ఇవ్వకుండా, ఈ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా సమయం కేటాయిస్తున్నారు. సినిమా చిత్రీకరణలో భాగంగా తరచూ ముంబైకి వెళ్లి వస్తున్న ఆయనకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి 'రాకా' చిత్రానికి సంబంధించిన ఓ కీలక షెడ్యూల్‌ను దుబాయ్‌లో నిర్వహించాలని చిత్ర బృందం తొలుత ప్రణాళిక రూపొందించింది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆ షెడ్యూల్‌ను హైదరాబాద్‌కు మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ స్వస్థలం హైదరాబాద్ కావడంతో, నగరంలోనే షూటింగ్ జరగడం ఆయన ప్రయాణ సమయాన్ని తగ్గించనుంది. ముంబైకి వెళ్లి రావాల్సిన అవసరం కూడా కొంతవరకు తప్పుతుంది. ఈ కీలక షెడ్యూల్ త్వరలోనే హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ చిత్రంలో నటిస్తున్న ఇతర ముఖ్య తారాగణం కూడా షూటింగ్ కోసం హైదరాబాద్‌కు రానున్నట్లు సమాచారం. అయితే షెడ్యూల్ మార్పుపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న 'రాకా'లో దీపికా పదుకొణె కీలక పాత్రలో నటిస్తున్నారు. రమ్యకృష్ణ, బబ్లూ పృథ్వీరాజ్, సిరి హనుమంతు తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని విశ్వానికి అతీతమైన కథాంశంతో భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. అల్లు అర్జున్, అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌కు మారితే, తదుపరి చిత్రీకరణ మరింత సౌకర్యవంతంగా సాగేందుకు అవకాశం ఉంటుంది. ఈ సినిమా నుంచి రాబోయే అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

బాణాలకు నెత్తుటి తానాలు పోయాలి



అగ్ర కథానాయిక రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా'. స్త్రీశక్తిని, మహిళా సాధికారతను చాటిచెప్పే స్ఫూర్తివంతమైన కథాంశంతో రూపొందిస్తున్న ఈ చిత్రంలో గోండ్ తెగకు చెందిన గిరిజన అమ్మాయి పాత్రలో కనిపించనుంది రష్మిక మందన్న. ఈ చిత్రానికి రవీంద్ర పుల్లె దర్శకుడు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో సోమవారం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుడుతూ 'ఓ మైసా రే' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరపరచిన ఈ పాటను సుద్దాల అశోక్‌తేజ రచించారు. సింధూజ శ్రీనివాసన్ ఆలపించారు. 'శత్రువుల కుత్తుకపై కత్తులనే నూరాలి రా.. బాణాలకు నెత్తుటితో తానాలు పోయాలిరా' అంటూ సాగిన ఈ పాటలో మైసాను ఈషి, ఐషి రూపాల్లో ఆవిష్కరించారు. స్త్రీ తాలూకు దైవిక శక్తినీ, ధైర్యసాహసాలను ఈ గీతం ప్రతిబింబించింది. అటవీ నేపథ్యంలో వందలాది డ్యాన్సర్లతో తెరకెక్కిన ఈ పాటలోని విజువల్స్ కూడా హైలైట్‌గా నిలిచాయి. ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.

మోముపై చిరునవ్వులు తెప్పిస్తుంది!



విభిన్న నేపథ్యాలు, మనస్తత్వాలు కలిగిన ఇద్దరు పిల్లలు వేసవి సెలవుల్లో కలుసుకొని స్నేహితులుగా మారితే ఎలా ఉంటుందనే పాయింట్‌తో 'సమ్మర్ హాలీడేస్' చిత్రాన్ని తీశామని చెప్పారు దర్శకుడు శ్రీకర్ నయన్. మాస్టర్ రోహన్, అరుణ్, బేబి ఖుషి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను ధీరజ్ మొగిలినేని నిర్మించారు. ఈ నెల 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం దర్శకుడు శ్రీకర్ నయన్ విలేకరులతో ముచ్చటించారు.మనందరి బాల్యం తాలూకు వేసవి సెలవుల జ్ఞాపకాల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని చెప్పారు. 'ఈ సినిమాలో జయసుధగారు అమ్మమ్మ పాత్రలో నటించారు. అరుణ్, జయసుధ మధ్య వచ్చే కొన్ని సీన్స్ కన్నీళ్లు పెట్టిస్తాయి. అలాగే వాసుకీగారి పాత్ర కూడా కథలో కీలకంగా ఉంటుంది. పిల్లలకు ఉండే సమస్యలు.. వేసవి సెలవుల్లో వాటికి ఎలాంటి పరిష్కారం దొరికిందనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. ఇటీవలకాలంలో విరివిగా వస్తున్న యాక్షన్, వయొలెన్స్ సినిమాలు చూసి ప్రేక్షకులు విసిగిపోయారు. ఇలాంటి సమయంలో ప్రేక్షకుల మోముపై చిరునవ్వులు తెప్పించే సినిమా ఇది. కథలోని భావోద్వేగాలు హృదయాల్ని కదిలిస్తాయి. ఇది పిల్లల సినిమా కాదు. పిల్లలు నటించిన పెద్దల సినిమా' అన్నారు.

తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా సోను భాయ్ (రాకేష్ గైక్లాడ్) నియామకం

- గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతమే లక్ష్యం.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేస్తాం: రాకేష్ గైక్లాడ్



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా రాకేష్ గైక్లాడ్ (సోనూ భాయ్) నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన జన్మదినం సందర్భంగా పార్టీ కీలక బాధ్యతలు అప్పగించిన కల్వకుంట్ల కవితకు రాకేష్ గైక్లాడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తెలంగాణ రక్షణ సేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పై తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఎగురవేయడమే తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలకు బీసీ అభ్యర్థులను ప్రకటించడం తెలంగాణ రక్షణ సేన పార్టీ సామాజిక న్యాయానికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత, అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.తన జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో కల్వకుంట్ల కవిత ఆశీర్వాదాలు తీసుకోవడం, అదే రోజున గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా నియామక బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందంగా ఉందని రాకేష్ గైక్లాడ్ తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మౌనిక నరేష్, సయ్యద్ అబూబకర్ బిన్ జాఫర్ , సిర్పుల రవికాంత్, నంద్యాల అనిల్ కుమార్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

- కౌంటింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తిరుపతి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్, తిరుపతి ఆర్ట్స్ కాలేజ్‌తో పాటు నాయుడుపేటలోని కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జిల్లాలోని తిరుపతి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వేంకటగిరి కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న నేపథ్యంలో ఎస్పీ ఆయా కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా చర్యలను సమీక్షించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తతను క్షుణ్ణంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరగకుండా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రతా విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

పాయ్యకొత్తూరులో కూటమి భారీ బైక్, కార్ల ర్యాలీ

ఇంటింటా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకోవడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా పాయ్యకొత్తూరు గ్రామంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ అభ్యర్థి రావిళ్ల మునిరాజు నాయుడుతో కలిసి భారీ బైక్, కార్ల ర్యాలీ నిర్వహించారు.గ్రామానికి ర్యాలీగా చేరుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, జెడ్పీటీసీ అభ్యర్థి రావిళ్ల మునిరాజు నాయుడికి గ్రామ మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వారి స్ఫూర్తితో శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే వారు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేస్తారని పేర్కొన్నారు.శ్రీకాళహస్తి మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలతో పాటు జెడ్పీటీసీ స్థానంలోనూ, నియోజకవర్గంలోని పలు చోట్ల ఏకగ్రీవాలు కావడం ప్రజల మద్దతుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోశీటు అప్రమత్తంగా ఉండాలి..

మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని (ప్రశ్న న్యూస్) ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మండల పరిషత్ ప్రత్యేక అధికారి పూర్ణ చందర్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ఎంపీడీవో శ్రీజా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కుదుదుల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, టీజీఈఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ

ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు అవసరమైన సూచనలు, వ్యవసాయ సలహాలు అందించాలని కోరారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులకు తగిన సూచనలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పశువులకు తాగు నీటి సమస్య రాకుండా చెరువులు, కుంటల్లో నీరు ఉండేలా చూడాలని సర్పంచులకు సూచించారు. ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అనేక గ్రామాల్లో గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు రూ.20లక్షల నుంచి రూ.25 లక్షల చొప్పున, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.12 లక్షల చొప్పున, మహిళ సంఘాల వివో కార్యాలయ భన నిర్మాణాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారని తెలిపారు.

ఈ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



భారీ షెడ్ నిర్మాణంపై అధికారుల దృష్టి పడేనా.?

- సాయి ప్రియ కాలనీలో నిర్మాణ పనులపై స్థానికుల ఆందోళన

- అనుమతుల వివరాలు బహిర్గతం చేయాలని విజ్ఞప్తి

- ఉల్లంఘనలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కీసర(ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ సాయి ప్రియ కాలనీలో చేపడుతున్న భారీ షెడ్ నిర్మాణం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందారా? మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగానే పనులు చేపడుతున్నారా? అన్న సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. భారీ విస్తీర్ణంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులపై అధికారుల స్పష్టత ఏదీ.?

సదరు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి వినియోగం, వాణిజ్య కార్యకలాపాలకు వర్తించే నిబంధనలను పాటిస్తున్నారా లేదా అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నట్లు తేలితే మున్సిపల్ ఆదాయానికి గండి పడటంతో పాటు పట్టణ ప్రణాళిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నన్నగిల్లే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. సామాన్యులు చిన్నపాటి నిర్మాణాలకు సైతం అనుమతులు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, భారీ షెడ్ నిర్మాణం విషయంలో అధికారుల పర్యవేక్షణ ఎక్కడుందంటూ ప్రశ్నిస్తున్నారు.

డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించాలి

సాయి ప్రియ కాలనీలో కొనసాగుతున్న భారీ షెడ్ నిర్మాణంపై కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులు, భూమి వినియోగం, నిర్మాణ నిబంధనలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఎలాంటి ఉపేక్ష లేకుండా పారదర్శకంగా వ్యవహరించి, మున్సిపల్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



భవిత కోసం భాగ్యనగర్ వస్తే భవిష్యత్తు చిత్తైంది

కలలతో వచ్చి భయంతో బతుకుతున్న విద్యార్థులు, కన్నవాళ్ల ఆశలు ఆవిరైపోతున్నాయి

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) దేశంలో మేట్రోపాలిటిన్ నగరాల్లో క్రైం రేట్ బాగ పెరగడానికి కారణం మద్యం,మగువ,షాట్ టైం లో జీవితం సెటిల్ అవ్వాలని కోరికలు ఆకాశానికి నిచ్చెనలు వేస్తున్నాయి.ఈ నగరంలో మహిళలకు ముఖ్యంగా ఒంటరిగా ఉంటున్న ఉద్యోగ పోటీ పరీక్షల అభ్యర్థులకు భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది.తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ ఇతర పోటీ పరీక్షల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత లక్షలాది మంది యువతీ యువకులు తమ ఉజ్వల భవిష్యత్తును వెతుక్కుంటూ జిల్లాల నుంచి హైదరాబాద్ బాట పడుతున్నారు.పల్లెల్లో తమ కలలను మోసుకుంటూ నగరానికి వచ్చే యువతులకు హైదరాబాద్ ఒక ఆశల దీపంలా మారింది.ఉమ్మడి కుటుంబాల నుంచి చిన్న గ్రామాల నుంచి నగరానికి వచ్చే మహిళలు"అశోక్ నగర్,అమీర్పేట్,మలక్పేట్" వంటి ప్రాంతాలలో హాస్టల్లో లేదా చిన్న చిన్న అద్దె గదులలో ఉంటూ భవిష్యత్తుని వెతుక్కుంటున్నారు. కుటుంబానికి దూరంగా ఉండి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కేవలం ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కష్టపడుతుంటారు. అలాంటి అబలను టార్గెట్ చేసుకొని కొందరు కిరాతకులు అరాచకాలకు పాల్పడుతున్నారు.

భవిష్యత్తు పక్కకు పెడితే,భయాందోళనలు విద్యార్థులు:

సూర్యాపేట జిల్లాకు చెందిన హేమలత (28) అనే యువతి హైదరాబాద్‌లో గ్రూప్స్ పరీక్షలకు సిద్ధం అవుతోంది.దీనికోసం ఆమె గడ్డి అన్నారం ప్రాంతంలో మరో ఐదుగురు మహిళలతో కలిసి ఒక గదిని అద్దెకు తీసుకుని నివసిస్తోంది.అయితే గత నెల అక్టోబర్ 27న సాయంత్రం ఒంటరిగా ఉన్న ఆమె గదిలోకి ఒక గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి ఆమెపై కూరగాయలు కోసే కత్తితో విచక్షణారహితంగా కడుపులో పొడిచాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆమె నుంచి సెల్ ఫోన్‌ను లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు.హేమలత అరుపులు గమనించిన పక్క గదిలోని ఆమె స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.క్షణాల వ్యవధిలోనే సంఘటన స్థలానికి చేరుకున్న మలక్‌పేట్ పోలీసులు ఘటనా స్థలంలో చోటు చేసుకున్న క్రైం సీన్ ని పరిశీలించారు,తీవ్రంగా గాయపడిన హేమలతను వెంటనే మలక్‌పేట్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా ఆమెకు అత్యవసర వైద్యం అందించడంతో ప్రస్తుతం ప్రాణాపాయం తప్పిందని, వైద్యులు తెలిపారు.డీసీపీ ఖరే కిరణ్ ప్రభాకర్ వ ర్యవే క్ష ణ లో , మ ల క్ పే ట్ పోలీసులు,టాస్క్‌ఫోర్స్ బృందం,సీసీటీవీ ఫుటేజీలు, స్థానికులను విచారించిన ఆధారంగా నిందితులను ఈ నెల 2న గడ్డి అన్నారం ఎక్స్ రోడ్ వద్ద ప్రధాన నిందితుని అదుపులోకి తీసుకుని అతని సమాచారంతో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు విలేకరుల సమావేశంలో పోలీసులు వెల్లడించారు.ఏ-1 కేసరి మణికంఠ అలియాస్ మున్నా వయస్సు (27)ఇతని నేర చరిత్రలో సుమారు 59 క్రిమినల్ కేసులు,ఏ -2 వంశీ కృష్ణ అలియాస్ నల్లి (28)పై 39 క్రిమినల్ కేసులు,ఏ -3అజయ్ కుమార్(28) నమోదైనట్లు ఉన్నత అధికారులు తెలిపారు.నిందితుడి నుంచి బాధితురాలికి చెందిన ఫోన్‌తో పాటు వివిధ కంపెనీలకు చెందిన మరో 22 సెల్‌ఫోన్లు,మూడు ద్విచక్ర వాహనాలు,నేరానికి ఉపయోగించిన స్టీల్ కత్తిని స్వాధీనం చేసుకొన్నారు.అయితే జంటనగరాల్లో జరుగుతున్న నేరాలను నియంత్రించాలంటే పోలీసులకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. అలాగే అనుమానాస్పదమైన వ్యక్తులపై మీకేమైనా అనుమానం ఉంటే వేంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



రేషన్ బియ్యంపై అక్రమార్కుల కన్ను

-రాజకీయ నాయకుల కనుసైగాల్లోనేనా.?

- అక్రమార్కులను కట్టడి చేయడంలో ప్రభుత్వ శాఖలు విఫలం
- రేషన్ బియ్యం అక్రమ దందాకు కొంతమంది అధికారుల అండదండలు
- నగరంలో,నగర శివారుల్లో రేషన్ బియ్యం దందా జోరు
- గోదాంలకు తరలింపు.. బ్రాండెడ్ సంచుల్లో రీ ప్యాకింగ్
- బియ్యం ధరలకు రెక్కలు రావడంతో పెరిగిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం
- సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ ఏది.?
- టాస్క్‌ఫోర్స్ దాడులు నామమాత్రమేనా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)పేదలకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తోంది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు అందించాల్సిన ఉచిత బియ్యం పక్కదారి పడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరం తో పాటు నగర శివారుల్లోని గోదాంలకు చేరుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు దాదాపు 80 రూపాయలకు భారీగా పెరగడంతో రేషన్ బియ్యానికి డిమాండ్ పెరిగి అక్రమ వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది. పేదల ఆకలి తీర్చాల్సిన బియ్యం అక్రమార్కుల వ్యాపారానికి కేంద్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

బ్రాండెడ్ సంచుల్లో రేషన్ బియ్యం

అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని గోదాంలలో నిల్వ చేసి, ఇతర బ్రాండ్ల పేర్లతో ఉన్న సంచుల్లో నింపి యదేచ్ఛగా మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని సేకరించడం, నిల్వ చేయడం, రీ ప్యాకింగ్ చేయడం, ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడం వంటి వ్యవహారాలు వ్యవస్థీకృతంగా సాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ దందా వెనుక ఎవరున్నారు.? ఎక్కడి నుంచి బియ్యం వస్తోంది.? ఎవరికి సరఫరా చేస్తున్నారు.? అన్న ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానం పూర్తిగా కరువవుతోంది. ఉదయం 3 గంటల నుండి తెల్లవారు 7 గంటల వరకు ఈ దందా దర్జాగా సాగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

శివారుల్లో భారీ షెడ్లు, గోదాంలే అడ్డాలు

బొంగులూరు గేట్, మంగళపల్లి, బడంపేట్, ఆదిబట్ల, నాదర్గుల్, జల్పల్లి, కాటేదాన్, మహేశ్వరం, ఆమనగల్, కల్వకుర్తి, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, పురానాపూల్, నాగోల్, బండ్లగూడ, తుర్కయంజాల్, షామీర్‌పేట్, గజ్వేల్, రామవరం, ఘట్‌కేసర్, భువనగిరి, మౌలాలి, మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో భారీ షెడ్లు, గోదాంలలో బియ్యం నిల్వలు ఉన్నాయనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

ఆయా ప్రాంతాల్లో గోదాంల కార్యకలాపాలపై సివిల్ సప్లై అధికారులకు, స్థానిక పోలీసులకు పూర్తిస్థాయి సమాచారం ఉండి కూడా చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండి సమగ్ర తనిఖీలు చేపడితే అక్రమ రవాణా వెనుక ఉన్న అసలు గుట్టు బయటపడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పత్రికల్లో కథనాలు వచ్చినా కదలని యంత్రాంగం

కొంతమంది రాజకీయ నాయకుల ప్రజాప్రతినిధుల కనుసైకిల్లో జరిగే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పలు సందర్భాల్లో పత్రికల్లో కథనాలు వెలువడుతున్నప్పటికీ పలు శాఖల అధికారుల్లో ఆశించిన స్థాయిలో కదలిక కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కొంత బియ్యం పట్టుకోవడం మినహా, ఈ అక్రమ వ్యాపారం మూలాలను ఎందుకు ఛేదించలేకపోతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణ చేస్తున్న వాళ్లపై ఐదు కేసుల పైనే ఉన్న వాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో ఉన్నతాధికారులకే తెలియాలి. చిన్న స్థాయి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటే సరిపోతుందా.? పెద్ద మొత్తంలో బియ్యం నిల్వ చేస్తున్న గోదాంల యజమానులు, సరఫరాదారులపై విచారణ ఎందుకు జరగడం లేదని, రాత్రి, తెల్లవారుజాము 3 గంటల తర్వాత రోడ్లపై రేషన్ బియ్యం సరఫరా జరుగుతుంటే అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్ల బాధ్యతరాహిత్యానికి నిదర్శనమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పేదల బియ్యం అక్రమార్కుల పాలు

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా రవాణా మార్గాలపై నిఘా, గోదాంల తనిఖీలు, నిల్వల రికార్డుల పరిశీలన, రీ ప్యాకింగ్ కేంద్రాల గుర్తింపు చేపట్టాల్సిన బాధ్యత సివిల్ సప్లై శాఖపై ఉంది. అక్రమ రవాణాకు సహకరిస్తున్న వారెవరైనా కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో సంయుక్త దాడులు నిర్వహించాలి. పత్రికలో కథనాలు వచ్చిన విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు చోద్యం చూడడం వెనక ముందుగానే వాళ్లకు కావలసింది అందాయ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేదల కడుపు నింపాల్సిన బియ్యం అక్రమార్కుల గోదాంలలో ఎందుకు మూలుగుతోంది.? అధికారుల నిఘా ఎక్కడ.? టాస్క్‌ఫోర్స్ దాడులు నిజంగానే అక్రమ దందాకు అడ్డుకట్ట వేస్తున్నాయా.? లేక దాడుల పేరుతో కాలయాపన చేస్తున్నారా.? సివిల్ సప్లై శాఖ మంత్రి, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు రోజులైనా సీసీ రోడ్డుకు నీటి క్యూరింగ్ ఏది.?

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి అధికారుల అండదండలా.?- ప్రశ్నించిన ఏఈ సూరజ్‌కు దురుసు సమాధానం
- ప్రజల సమస్యలను పట్టించుకోని ఇంజినీరింగ్ శాఖ, నాణ్యతపై స్థానికుల ఆగ్రహం
- క్యూరింగ్ చేయకపోవడంతో సిసి రోడ్డు నాణ్యత గాలికైన మరి అధికారుల పర్యవేక్షణ ఏది.?





నాచారం (ప్రశ్న న్యూస్) ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లకు లేదా.? పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులకు లేదా.? జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్ల నిర్మాణం పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలు గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాచారం సర్కిల్‌లోని మల్లాపూర్ డివిజన్ పరిధిలోని రోడ్ నంబర్ 17, భవానీనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తయినా క్యూరింగ్ ఏదీ.?

భవానీనగర్‌లో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేశారు. అయితే రోడ్డు నిర్మాణం పూర్తయి నాలుగు రోజులు గడుస్తున్నా, కనీసం నీటిని చల్లి క్యూరింగ్ చేసే బాధ్యతను కాంట్రాక్టర్ విస్మరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీ రోడ్డు పటిష్టంగా ఉండాలంటే నిర్దిష్ట పద్ధతిలో తగిన కాలం క్యూరింగ్ చేయడం అత్యంత కీలకం. క్యూరింగ్ సరిగా చేయకపోతే కాంక్రీట్‌లో పగుళ్లు ఏర్పడటం, మన్నిక పూర్తిగా తగ్గడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇంతటి కీలకమైన అంశాన్ని కాంట్రాక్టర్, నాచారం సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నది స్థానికుల ప్రశ్నిస్తున్నారు.

ప్రశ్నిస్తే దురుసు సమాధానమా.?

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానికులు సంబంధిత ఏఈ సూరజ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌ను ప్రశ్నించాల్సిన అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉండగా, స్థానికుల ఆరోపణల ప్రకారం ఏఈ సూరజ్ కూడా ఈ వ్యవహారంలో దురుసుగా సమాధానం ఇచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినప్పుడు 'మీ ఇష్టం ఉన్నవాళ్లకు చెప్పుకోండి' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు నిలదీస్తున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదా.? మరి డిప్యూటీ జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ పూర్తిగా కనుమరుగైందని మండిపడుతున్నారు.

డిప్యూటీ, జోనల్ కమిషనర్లు స్పందించరా.?

జీహెచ్ఎంసి పరిధిలో ఒకవైపు నాణ్యత లేని పనులతో ప్రజాధనం వృథా అవుతుందనే ఆందోళన, మరోవైపు ప్రశ్నించిన ప్రజలతో అధికారుల దురుసు ప్రవర్తన. వెరసి భవానీనగర్‌లో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం పనితీరుపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు పూర్తయ్యాయని బిల్లులు చెల్లించే ముందు వాటి నాణ్యతను పరిశీలించే బాధ్యత ఎవరిది.? క్వాలిటీ కంట్రోల్ లో నాణ్యత లేకున్నా బిల్లులు ఎలా జనిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. కాంట్రాక్టర్‌కు నిబంధనలు వర్తించవా.? ఏఈ స్థాయి అధికారి పర్యవేక్షణలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే డిఈ, ఈఈ, ఎస్ఈ, ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్లు.?

ఇప్పటికైన జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ తక్షణమే స్పందించి భవానీనగర్ సీసీ రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. కాంక్రీట్ నాణ్యత, క్యూరింగ్ నిర్వహణ, పనుల అంచనాలు, కాంట్రాక్టర్ బాధ్యతలను సమగ్రంగా తనిఖీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపైనా శాఖాపరమైన విచారణ జరపాలని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజాధనంతో రోడ్లు వేయడం అభివృద్ధా.? లేక కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడమే లక్ష్యమా.? మల్లాపూర్ లోని భవానీనగర్ రోడ్డు వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

వెంకట్ రెడ్డి నగర్ బీజేపీలో పదవుల పంచాయితీ

- డివిజన్ అధ్యక్ష పదవిపై తీవ్ర ఉత్కంఠ.. ఎవరికి దక్కేను పీఠం.?
- పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలకే ప్రాధాన్యత ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కాదని ఎంపీ ఈటల వద్ద పైరవీలంటూ పార్టీలో చర్చ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజకవర్గం లోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ బీజేపీలో అధ్యక్ష పదవి వ్యవహారం రాజకీయ వేడిని రాజేస్తోంది. డివిజన్ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునేందుకు పలువురు నేతలు పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ స్థానిక కార్యకర్తల్లో నెలకొంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన వారిని పక్కనపెట్టి, పలుకుబడి, పైరవీలతో పదవులు దక్కించుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి .స్థానికంగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్‌ను సంప్రదించకుండా, ఆయన ప్రాధాన్యతను పక్కనపెట్టి నేరుగా ఎంపీ ఈటల రాజేందర్ వద్ద పైరవీలు సాగిస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక గల్లీ స్థాయి నాయకుడు స్థానిక మాజీ ఎమ్మెల్యే నాయకత్వాన్ని పక్కనపెట్టి తన పలుకుబడిని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీకి పనిచేసిన వారిని పక్కనపెడతారా.?

పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుండా, ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించి బీఆర్ఎస్ పార్టీకి పనిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పైరవీలకు తలొంచి పదవులు కట్టబెడితే క్షేత్రస్థాయిలో పార్టీకి నష్టం తప్పదని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వారికి కాకుండా పైరవీలు చేసేవారికి పదవులు దక్కితే కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

పదవి వెనుక అసలు ప్రయోజనాలేమిటి.?

ఈటల రాజేందర్ పేరు ఉపయోగించుకొని రాజకీయ పలుకుబడిని పెంచుకోవడంతో పాటు, అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు కూడా స్థానిక నాయకులలో వినిపిస్తున్నాయి. బీజేపీ అధిష్ఠానం ఇప్పటికైనా క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, నిజాయితీగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అవకాశం కల్పించాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పైరవీలకు ప్రాధాన్యత ఇస్తారా.? పార్టీ కోసం పోరాడిన వారికి పట్టం కడతారా.? అన్నది వేచి చూడాల్సిందే.

ఏసీబీ వలలో మెప్మా ఏడీ

- సోదాల్లో రూ. 4.75 కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తింపు
- ఉప్పల్‌లో >G3 భవనంతో పాటు పలుచోట్ల స్థలాలు, ప్లాట్లు
- కిలోల కొద్దీ బంగారం, వెండి, ఖరీదైన కార్లు స్వాధీనం
- హైదరాబాద్ సహా 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పురపాలక ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరి రావు అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో ఆయనపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, జరిపిన సోదాల్లో సుమారు రూ. 4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. మంగళవారం హైదరాబాద్‌తో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. యాదగిరి రావు నివాసం, కార్యాలయం, బంధువులు, బినామీలకు సంబంధించిన ఇళ్లలో ఈ సోదాలు జరిగాయి. ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఉప్పల్ హైకోర్టు కాలనీలో 334 గజాల స్థలంలో నిర్మించిన G+3 భవనం విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని అంచనా. దీంతో పాటు



ఉప్పల్‌లోనే రెండు ఫ్లాట్లు, ఒక వాణిజ్య దుకాణం, హబ్సిగూడ, పెద్ద అంబర్‌పేట్, మేడిపల్లి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో మొత్తం 12 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు పత్రాలను గుర్తించారు. సోదాల్లో సుమారు 1.8 కిలోల బంగారం (1,792 గ్రాములు), 3 కిలోల వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ. 73 లక్షల విలువైన టయోటా ఫార్చూనర్, మరో కారు, మూడు ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 32.30 లక్షల నగదు నిల్వలు, రూ. 29 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ. 7 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఉన్నట్లు తేలింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ. 4.75 కోట్లుగా లెక్కగట్టామని, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ ఇంకా చాలా ఎక్కువగా ఉంటుందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. యాదగిరి రావు కుమారుడికి సంబంధం ఉన్నట్లు భావిస్తున్న రబ్బర్ ఫ్యాక్టరీ, ట్రాన్స్‌మిషన్ పరిశ్రమల్లోని పెట్టుబడులపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన అధికారులు, యాదగిరి రావును ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కేసులో విచారణ కొనసాగుతోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588